UNIVERSAL LIBRARY
OU_204585
UNIVERSAL LIBRARY

# మానవ హృదయాలు

[ బెంగాలీ నవల ]

వనఫూల్

# మానవ హృదయాలు

[ బెంగాలీ నవల ]

మాతృక :

(వనపూల్)

★

అనువాదం :

" నీలకంఠం "

ఉదయ సాహితి
విజయవాడ - 1

ప్రథమ ముద్రణ
నవంబరు 1952
వెల: రూపాయి

సవరణ

మోదుకూరి వెంకటేశ్వర్లు

ముద్రణ :
కల్యాణి ప్రెస్,
విజయవాడ.

# మానవ హృదయాలు

చలిచలిగా జ్వరం వచ్చినట్లుంది. అవును జ్వరమే! ఈ జ్వరంలో 'ఆమెకు' ఉత్తరం రాస్తున్నాను. 'ఆమె' వివాహం ఇంకొకరితో స్థిరపడిపోయినప్పటికీ—నా ప్రయత్నం వొఠ్ఠి మూర్ఖమని తెలిసుండికూడా—రాస్తున్నాను. ఐనా-నా కవిత్వం మాత్రం కుంటుపడలేదు. జ్వరం వచ్చినట్లుంది. జ్వరంలోనే వాగుతున్నాను.

"మనసులోని సంగతు లేమని చెప్పుదు రాణీ!
వృధా భరిత హృదయా న్నేమని తెలుపుదు పాషాణీ!
ఈ మనసులోని కోరిక నీ వెలా తెలుసుకుంటావో
నా నిట్టూర్పే నీదిగదా, ప్రియసఖి పాషాణీ!"

ప్రేమ జగత్తులో ఇరుక్కుని ఏ మేమిటో పాడుకుంటున్నాను. అంతా చీకట్లో మునిగిపోయింది. ఆఖరికి ఇంటి కిటికీలు కూడా మూయబడి వున్నయ్! నా ఎదురుగా వున్న కిటికీ సందులోంచి చిన్న వెలుతురు కిరణం ఒకటి లోపలకు దూసుకవస్తుంది. ఆ సన్నని కిరణపు వెల్తుర్లో గదంతా అస్పష్టంగా కనిపిస్తూవుంది. మంచి చెడుగులుకూడా కనిపిస్తున్నయ్. బాణంతో కొట్టబడిన పక్షిలా చీకటి మూర్ఛపోయి పడివుంది. అయితే—ఇంతకీ నే కలనేమన్నా గంటున్నానా? ఏకల కంటున్నాను? మృత్యువును గురించా?

"డాక్టరుగారూ ?—"

త్రుళ్లిపడి—"ఎవరూ? లోపలికి రండి" అన్నాను.

ఒకతను లోపలికి వచ్చి దర్శనమిచ్చాడు. సలఫై ఏళ్లుంటాయి. మెల్లగా నవ్వి "తమర్ని కొంచెం కష్టపెట్టాలని వచ్చాను నెలరోజుల్నుంచీ నా భార్యమనసు పాడైపోయిందండి. మా పక్కింట్లో భజనలు చేస్తూవుంటారు. ఒకనాడు అక్కడికి వెళ్ళి వచ్చింది. అంతే-అప్పట్నుంచీ దాని మనసు పాడైపోయింది" అన్నాడు.

"అసలు సంగతేమిటో వివరంగా చెప్పండి?"

"ఏం చెప్పమంటారండి? భజనకు వెళ్ళేముందు బాగానే వుండండి. అక్కణ్నుంచి పదకొండు గంటల రాత్రప్పుడు ఇంటికి తిరిగి వస్తూనే "నా నందగోపాలుడు ఏడీ?" అనీ 'మా గోవిందు డెక్కడా' అనీ-ఒకటేగోల. మాటి మాటికీ అదేవరస. అడగడం, పాడడం; పాడడం అడగడం. ఏమిటో నాకంతా అయోమయంగా వుందండి డాక్టరుగారు తమరేదైనా మంచి మందు [illegible]

"మీ భార్య ఎక్కడుంది?"

"నావెంబడే తీసుకవచ్చాను; బండ్లో వుంది."

"ఇక్కడికి తీసుకరాండి"

ఆయన తన భార్యను లోపలికి తీసుకవచ్చాడు ఏమంత పెద్దవయసు కాదు చిన్నపిల్లే! జుట్టు విరబోసుకొనివుంది. గుడ్డలన్నీ చింపరపందరగా వున్నయ్. నన్ను చూడ్డంతోనే "నన్నెందుకని పిలిపించారు. మీరు నన్ను పిలిపించారటగా?" అని ఆమె అడిగింది.

"అవును కూర్చోండి."

ఆపక్కనున్న కుర్చీలో దఢాలున కూర్చుని తల ముందుకు చాపి "మీరెందుకు పిలిపించారో చెప్పండి?" అన్నది.

"ఏమిటలా అరుస్తారు? మీకు మతిపోయిందా యేం?"

నావేపు ఒక క్షణంసేపు కళ్ళుచించుకుని చూసి "నాకేం పోలేదు. మీకేమన్నా పోయిందేమో వెతుక్కోండి." అన్నది.

"మీరు ఇంట్లో గోలచేస్తారనీ, 'నా నందగోపాలుడా-నా నల్లనయ్యా' అని పాడుతారనీ మీ ఆయన అంటున్నాడు...."

"అయితే ఆ పాటలు మీరు వింటారా? మీరెప్పుడూ విననేలేదా?—ఐతే వినండి!

"నందగోపాలా, నందకిశోరా;
ఒంటరినానను జాగేలరా,
లోకముపై చీకటి చేతులు సాచే
హృదయమేమొ గజగజ భీతిల్లె
నీ రాక లే దేమి సేతురా
చిరుగజ్జలు గళ్ళు-గళ్ళన
గళ్లన-చిరుగజ్జెలు, గళ్లగళ్లన
నందగోపాలా - నందకిశోరా!"

ఏమేమిటో మతిలేకుండా పాడుతూవుంది. ఎందుకోసమో పాట అతాత్తుగా ఆపి తెల్లబోతూ నా ముఖంవేపుకు చూసింది. నేను వెనక్కుతిరిగి చూసాను. పొరుగింటి దాసీమనిషి నిలుచుని వుంది.

పాడుతున్నదల్లా దాసీమనిషి చేతిలోని పిల్లవాణ్ణి చూసి "రా, నాయనా! నావద్దకు రా! రా....రా....' అని అన్నది.

ఆ పిల్లవాడికి మూడురోజుల్నుంచీ జ్వరం తగుల్తూవుంది నాకు చూపించేందుకు దాసీని ప్రతిరోజూ ఆ పిల్లవాణ్ణి తీసుకు వస్తూవుంది.

"రా నాయనా! నీకు పెద్ద బొమ్మ యిస్తాను నా దగ్గరకు రా. రావూ? రావూ?—అరే, నువెక్కడి వెధవ్వురా?" అంటూ వెళ్లి, ఒక్క వూపున పిల్లవాడిని లాక్కుని గుండెలకు అదుము కుంటూ కళ్లు మూసుకుంది

ఆ పిల్లవాడు గట్టిగా ఏడ్చాడు 'అయ్యో అయ్యో' అని దాసీది అరుస్తూనేవుంది బలవంతాన ఆమె దగ్గర్నుంచి పిల్లవాణ్ని లాక్కున్నాను. దాసీది పిల్లవాడితో పారిపోయింది

ఆమె కళ్ళవెంట నీళ్ళు జలజల రాలినయ్ కన్నీళ్ళతో ఆమె నావేపు చూసి "ఏ పిల్లవాడూ నా వొళ్ళోకి రాడుగా మోలు! అంతేనా?—ఐతే ఎందుకని రారో చెప్పండి డాక్టరుగారూ?" అని అడిగింది.

ఆ పిచ్చిదాన్ని పరీక్ష చేసి బైట వున్న బండి ఎక్కించాను. ఆతర్వాత ఆ భర్తను పిలిచి "మీకెంత కాలం నుంచి 'గనేరియా' వుంది?" అని అడిగాను.

ఆయన ముందు కొంచెం భయపడ్డాడు ఆ తరవాత "పది సంవత్సరాలపైకుంది. నా కిప్పుడు ముప్పై సంవత్సరా లున్నయ్" అన్నాడు

"ఐతే-పిల్లా పిచేమన్నా కలిగిందా?"

"కలిగిందండీ కానీ, పుట్టడంతోనే చనిపోయింది"

కొంచెంసేపు వూరుకుని "మీ భార్య వొంటిమీద నల్లని

కొరడాదెబ్బల మచ్చలు వున్నయ్. మీ రేమైనా కొట్టారా?" అని అడిగాను.

ఆయన కొంచెంసేపు నా కళ్ళల్లోకి చూసి "అవునండి. రెండు మూడు రోజుల క్రితం కొట్టానండి. "ఆడదాన్ని కొట్టందే లొంగదు" అని మా బంధువులంతా అంటుంటే.... ఐనా ఎక్కువగా కొట్టలేదండి! పాపికే...." అని పూరుకున్నాడు.

"సరేలెండి. దయచేసి యికనించి కొట్టకండి. బిడ్డలు కలగనంతకాలం ఆమె యిలాగే వుంటుంది. ఐతే బిడ్డలు కలుగుతారని నమ్మకం నేను చెప్పలేను. ఐనా కొంతకాలం మందులవల్ల ప్రయత్నం చేసితీరాలి. తమ పేరేమిటి?

"గోపాల్‌దాసు"

అతనికి మందు రాసిచ్చి పంపాను.

ఆయన బైటికి వెళ్ళాడో లేదో, మా పక్కింటి హరీశుడు వచ్చి 'డాక్టరుగారూ, ఎవరో పిచ్చిది పిల్లవాడి గొంతు నులిమిందటగా?" అని అడిగాడు.

ఆయనగారికి జరిగిన సంగతంతా చెప్పాను.

"అలానా! సరేలెండి. మీ రొకసారి వచ్చి పిల్లవాణ్ణి చూడండి" అని హరీశుడు అన్నాడు.

"వస్తాన్లే: కానీ, 'గ్లూకోజ్' ఇస్తున్నారా?"

"ఇంకా కొనలేదండి. ఇవాళ ఎలాగైనా తెస్తాను. నా జీతం చాలాతక్కువని మీకుతెలుసు. ఎనిమిదిమంది పిల్లలు! పెద్ద కుటుంబం. మీబోటి సత్పురుషుల ఆశీర్వాదంవల్ల బండి నడుపుకుంటూ వస్తున్నాను. దయుంచి మీరొకసారి పిల్లవాణ్ణి చూడండి. 'గ్లూకోజ్' ఇవాళ తప్పక తెస్తాను.

హరీశ్ బాబు వెళ్ళిపోయాడు. బీదవాడవడంచేత ఎప్పుడూ పిల్లాపీచుతో తంటాలుపడుతూవుంటాడు. ఎంత బాధపడుతూ వున్నా నిన్నటి సాయంకాలంవరకూ 'కామవర్ధని' ఇంజెక్షనులు తీసుకోవాలనే అతను నాతో సలహాలు, సంప్రదింపులూ జరిగించాడు. మానవుల మనసుకూడా మహా అద్భుతమైనదే! నన్ను నేను చూసుకున్నపుడు విస్మయం కలుగుతూ వుంటుంది

విద్యార్థిగావున్న నా జీవితం గుర్తుకువస్తుంది. ఆరోజుల్లో ఎంతో నిష్ఠగా వుండేవాణ్ణి! నా 'స్టౌ' మీద పొరుగింటివారి అమ్మాయి కోడిగుడ్లు వండుతుంది అని 'స్టౌ' తీసి బయట పారేశాను. కానీ, ఇవాళో?–ఈనాడు కోడిమాంసంలేకుండా 'ముద్ద' పోషణంలేదు. కోడిమాంసమనేమిటి? నిషేధించిన మాంసాలుకూడా నాకు అడ్డంకికావు. మానవుడు ఇరవైనాలుగు గంటల్లో మారిపోతూనే వుంటాడు. ఈనాటి నేను సంవత్సరమయాక–సంవత్సరందాకా ఎందుకు? కొన్ని నెలలలోపునే ఇంకొక వ్యక్తిగ, ఇంకొక రకంగ మారిపోతానేమో!

స్కూలూ, కాలేజీ, విశ్వవిద్యాలయం, ధర్మం, ఆచారం, హితోపదేశం, ఇవన్నీ "మాతృవత్-పరదారేష్" [పరాయిస్త్రీలు తల్లులవంటివారు] అని నేర్పుతూవుంటాయి పెద్దలు, మహాత్ములు బోధిస్తుంటారు. ఐనా నేను పరాయి ఆడదాని ప్రేమతో బాధపడుతున్నాను. మీరు నవ్వుతూవుంటారనుకుంటాను; నవ్వకండి! 'ఆమె' పరాయి ఆడది కాదు. నా అస్థిత్వమంతా పుచ్చుకుంది .. ఇంకా ఇంకా ఎక్కువగా చెప్పడమెందుకు? నేను డాక్టరును. కవినికూడాను! ఒకవేళ మీరు నా జీవిత చరిత్ర వినాలనుకుంటే

నా కవిత్వాన్ని మీరు తప్పక చదివితీరాలి. నా కవిత్వంలోనే నా జీవితచరిత్రను గురించి రాసాను.

"డాక్టరుగారూ?"

"ఎవరూ....? లోపలికి రాండి."

# 2

నాలుగువేపులా కటిక చీకటి కారట్లాడుతూవుంది. నదిలో చిన్నపడవమీదకూచుని వెళ్తున్నాను. నా వూరికి దూరంగా వున్న ఒక గ్రామములో ఒకబ్బాయికి జబ్బుచేసింది. ఆ యబ్బాయిని చూసి మందిచ్చేందుకే వెళ్తున్నాను.

నిబిడాంధకారముమధ్య నదీమతల్లి మాట్లాడుతున్న భాష వింటున్నాను. వేగంగా ప్రవహించే గంగానదీమతల్లి భాషా, ప్రవాహంలోని కలకలారవమూ నన్నెక్కడికో లాక్కుపోయినయ్. నేను ఆనందంతో కళ్లుమూసుకున్నాను. మెల్ల మెల్లగా ఎక్కణ్ణుంచో 'నా రాణి' వచ్చి నన్నంటుకుని కూచుంది. ఏ విధమైన చప్పుడూ లేదు. పడవ పోతూనేవుంది. ప్రవాహము తన గోడు చెబుతూవుంది. కాలం గడిచిపోతూవుంది. 'నా రాణి' తన శరీరాన్ని నా శరీరానికి ఆనించి కూచుంది. సున్నితమైన 'ఆమె' స్పర్శను అనుభవిస్తూ శతాబ్దాలు శతాబ్దాలు గడిపినట్లు కూర్చున్నాను. ఆ స్పర్శవల్ల, నా తనువు, మనసు, ప్రాణం, కష్టపడిపోయింది. హృదయంలోంచి ఆవేదనలాంటి ఏడుపు పొంగి పొర్లింది. తీయని బాధామయమైన ఈ అనుభూతిని ఏమని

వెల్లడించను? దీన్ని ఏ విధంగా నిరూపించను? విడమరిచి వెల్లడి చేసేందుకు శబ్దాల్ని ఎక్కడ్నుంచి తీసుకరాను? నా హృదయం కవిత్వంతో నిండిపోయింది

"కటిక చీకటిలోన
కారు మొయిలులోన
కళ్ళుమూసుక నేను
కాంచితిని నీ రూపు
దివ్యతేజము తోడ
చేసితా రావే!
వచ్చి నా హృదయముతో
దొమ్ముకొని పోవే!"

పనికిరాకపోయినప్పటికీ ఆమె స్వరం వింటున్నాను.

"పగలు నేను నీకేమీ కాను. సూర్యభగవానుడి వెలుతుర్లో నేను లోకానికీ, సమాజానికీ పనికివస్తాను. కటిక చీకటి రాత్రి పూట నేను కేవలం నీదాన్ని" అని అన్నట్లుగా వుంది.

"ప్రియసఖీ! అప్సరసా!
ఈ జీవితమే నాశనమా!
దాగుడుమూతల దోబూచులకు
దరిదాపుల నీవే లేవా?"

ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నా శరీరానికి తగులుతూ వున్నయ్! తల వెంట్రుకలతో ఆమె నా శరీరమంతా కప్పింది. అనంతాకాశ మధ్యంలో నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నయ్. చీకటిని తరిమినట్లుంది

"నన్ను మరచిపోవొద్దు. నే నుండడంచేతనే మీరు బతక గలుగుతున్నారు. నా వునికిలోనే మీ వునికి యిమిడివుంది. మీ అంతట మీరు పగటిపూట ఎప్పుడైనా ప్రకాశించగలిగారా? నా గుండెల మీదనే మీ జ్యోతి తళుక్, బెళుక్‌మంటూ వుం టుంది సుమా!" అని చీకటి చెబుతున్నట్లుగావుంది

హే అంధకారమా! నీకు నా హృదయపూర్వకమైన నమ స్కృతులు! హే నక్షత్ర నివాసస్థానమా! నీకు నేను నమస్క రిస్తున్నాను. నువ్వే నా స్వప్నసాగరానికి నావికవు! అసంభవాన్ని సంభవంగానూ, దూరాన్ని దగ్గరగానూ, అంతర్హితాన్ని బాహ్య రూపంలోకి లాక్కువచ్చే శక్తి సామర్థ్యాలు చేతులో పెట్టుకున్న దానా! నువెంతో గొప్పదానివి! నువు చిరంజీవివి! స్నేహమయీ నా నమస్కృతులు తీసుకో. ఐనా-ఎంతకాలంవరకు? ఎంతకాలం వరకు తమ అస్థిత్వం నిలబడివుంటుందో అంతవరకూ నా నమ స్కృతుల్ని స్వీకరించు. వెలుతురురథం తన చక్రాల్ని ధ్వని చేస్తూ వచ్చేస్తూవుంది.

అప్పుడు నువ్వు....? నా ప్రాణేశ్వరీ! నువెక్కడ దాక్కుని వుంటావు? అపురూపమైన నీసౌందర్యాన్ని ఎక్కడ దాస్తావు? ఈ స్నిగ్ధ మధుర ముఖాకృతి....!

'ఆమె' శ్వాస, నిశ్వాసాలు ఎక్కువవుతూవున్నయ్. ఆలిం గనంలోని పటుత్వం తగ్గుతూవుంది! నల్లని తన కేశరాశిని ముడివేసుకుని నాదగ్గర్నించి వెళ్ళిపోవాలనే కోరికతో వున్నట్లుంది.

"క్షణంసేపు ఆగవా?"

అయినా ఎక్కడుంది? వెళ్లిపోయింది....వెళ్లిపోయింది.

"బాబుగారూ, మెల్లగా దిగండి" పడవనడిపేవాడు అన్నాడు.

"ఎందుకు? ఏమన్నా వుందా?"

"ఏదో శవం కింద పడవకు తగులుకున్నట్లుంది"

కిందకు దిగి చూసేప్పటికి ఒక ఆడదానిశవం పడవకు తగులుకుని వుంది వెంట్రుకలు నీళ్ళల్లో ఈదుతూవున్నయ్. పెదిమలమీద, బుగ్గలమీద మాంసంలేచి పండ్లికిలిస్తూ భయంకరంగా నవ్వుతున్నట్లుగా వుంది

నేను ఏ రోగిన్నైతే చూడాలనుకుని వచ్చానో, ఆ రోగి తాలూకువాళ్ళు లైట్లుపట్టుకుని వొడ్డున నిలుచుని వున్నారు. నేను దిగీ దిగడంతోనే రోగి తండ్రి వయసువాడు వచ్చి నా రెండు చేతులూ పట్టుకుని "డాక్టరుగారూ, కొంచెందూరం నడిచివెళ్ళాలి. మీకోసం సాయంకాలంనించీ మేమంతా ఎదురుచూస్తున్నాం" అన్నాడు.

ఆయనగారింటికి వెళ్ళతూనున్నాం: "జబ్బు ఎప్పట్నుంచి?" అని అడిగాను.

"ఎనిమిది రోజులైందండీ"

"ఇంతకుముందు ఏ మందు వాడారు?"

"ఎలోపతి వైద్యం మా కెప్పుడూ సరిపోలేదు. ఆ కారణంతో హోమియోపతి మందు వాడుతున్నాం కానీ, రోగం ఎక్కువైంది. ఏమీ పాలుపోక మీకోసం కబురు పంపాము"

"సరే." అని రోగిగదిలోకి వెళ్ళి పరీక్షించాను. డబుల్ నిమోనియా అని తేలింది. ఆ రోగిపరిస్థితికూడా బాగుండలేదు ఈ రాత్రి గడవడమే కష్టం! రోగికి స్పృహలేదు. ఆస్థితిలో వున్న

ప్పటికీ కలవరిస్తూనే వున్నాడు "అదిగో కోశాదు. నీవు చూడ్డం లేదూ? బ్బ! ఎంతెరక్తం! నన్నిక్కణ్ణుంచి తీసుకొని వెళ్ళండి. అదిగో ఇంకొకరుల సరికారు! అరే చూస్తారేం? పోలీసుస్టేషనుకు కబురు చేయండి! పద... పద ..."

ఇదే వరస. కలవరింతలు తమాషాగా వున్నయ్.

ఆ రోగి తండ్రిని బయటకుపిలిచి యదార్థం చెప్పాను. అంతా విన్నాక ఆ తండ్రి "డాక్టరుగారూ, ఈరాత్రికి మీరు ఇక్కడే వుండండి. మీరు వెళ్ళకండి. మీకెంత ఫీజు కావాలో అంత ఇస్తాను, మీరు మాత్రం వెళ్ళకండి" అన్నాడు,

"నే నిక్కడ వున్నందువల్ల లాభ మేమిటి?"

ఎన్ని చెప్పినా ఆయన వినలేదు. ఆఖరికి నేను అక్కడే వుండవలసి వచ్చింది. "సరే, మీరొక పని చేయండి. అయినా ఒక మనిషి మాత్రం తప్పకుండా రోగిని కనిపెట్టుకొని ఈ రాత్రంతా వుండాలి. వొంతులు వేసుకుని మీరంతా ఒకరి తర్వాత మరొకరు రోగి దగ్గర మేలుకొని కూర్చోవాలి. మధ్య మధ్య నేనూ వచ్చి చూస్తుంటాను. మీ ఇంట్లోని వాళ్ళంతా ఎంత మంది?" అని అడిగాను.

"నేనూ....మహేంద్రుడూ, కోడలూ, నా భార్య. అటు వంటప్పుడు రోగి దగ్గర కోడల్ని వుంచుదామా? నా భార్యకూడా రోగంతో మంచంలో వుంది. భయంకరమైన తల నొప్పి దాన్ని పట్టుకుంది. తమరు కొంచెం అటువేపుకూడా ఒక కన్నుంచాలి. దాని దగ్గరకూడా ఒక మనిషి వుండాలి. బాబుగారూ! కష్టాల నేవి ఇలానే వస్తే ఒకదానిమీద మరొకటి వస్తూనే వుంటాయి."

ఆయన భార్యనుకూడా చూశాను. పదహారు పదిహేడు సంవత్సరాల వయసుంటుంది. మూడో భార్యట! మూడో భార్యను ఏ విధంగా జరగాలో అంత ఇదిగానే జరుగుతూ వుంది. 'యాస్పరిన్' మాత్ర ఒకటిచ్చి - నిద్రపోనివ్వమని హెచ్చరిక చేసి ఆ ముసలాయనతో "ఈమెగారు చాలా భయపడుతూవుంది. తమరు ఈమె దగ్గరే వుండండి! అవసరం కలిగినప్పుడు మిమ్మల్ని పిలుస్తాను" అని అక్కణ్నుంచి వచ్చి, కొడుక్కు కావలసిన ఏర్పాట్లు చేసాను.

ఎంతోసేపు ఆలోచించి అతనికి ఇంజక్షన్ యిచ్చాను. ఒకామె రోగి తలవద్ద కూచుని చన్నీటి గుడ్డను నొసలుమీద అద్దుతూ వుంది. ఆమె రోగికి భార్య కావొచ్చు! మహేంద్రుడు - అంటే - రోగి మేనమామగారు ఆ దగ్గరే నిలుచుని వున్నాడు ఇంజక్షన్ యిచ్చాక అతను నాతో "పదండి డాక్టరుగారూ! ఏదైనా కొంచెం తిని 'టీ' తాగుదాం! మీరు 'టీ' తాగుతారు కదూ? అని అడిగాడు.

"ఆ "

మే మిద్దరం బైట వరండాలో కూచుని టీ' తాగుతూ వున్నాం లోపల్నుంచి రోగి పలవరింతలు వినపడుతూనే వున్నయ్.

" అదిగో. అదిగో ఓ హో ! ఔటయాను నరేంద్రుడుకేం పిచ్చోగాని సరిగ్గా ఆడనేలేదు. చూరోయ్! ఒక్క బీడీ ఇవ్వు." పాపం ఇదీ ధోరణి!

నా దగ్గర కూచునివున్న మహేంద్రుడు "డాక్టరుగారూ!

వీళ్ళు వొట్టి పరమలోభులండి. నేను రాసట్లయితే మిమ్మల్ని పిలిచే వాళ్లేకారు." అన్నాడు.

నేను నవ్వుతూ "నేను వచ్చినా ఏమవుతుంది? అతను బతుకుతాడనే ఆశ లేదు" అన్నాను.

ఆ మాట విని ఆయనగారేమీ చలించలేదు. "ఇందులో మీ తప్పేముందండీ? మొదట్నుంచీ మీదగ్గర మందు తీసుకుంటే బావుండేది. కానీ, వీళ్ల పరమలోభిముండాకొడుకులు! వీళ్ళసంగతి మీకు తెలియదు డాక్టరుగారూ! నేనొక నల్లమందు రాయుణ్ణి లెండి! కుర్రవాడికి జబ్బుగావుందని విని పరుగెత్తుక వచ్చాను. డాక్టరుగారూ మీరు నమ్మరు కానీ. వచ్చినప్పట్నుంచీ ఒక పాల చుక్క కూడా నోట్లో పోసుకోలేదు. పుత్ర వ్యామోహపలండీ, మూల వెధవలు ...' అని అన్నాడు.

ప్రసంగాన్ని మార్చాలనే వుద్దేశ్యంతో "ఈ కుర్రవాడు ఏంచేస్తుంటాడు?" అని అన్నాను

"చేసేదేముందండి లెండి; బి ఏ. ఫెయిలై వివాహం చేసుకున్నాడు ఆనుమానాస్పదమైవుంది. అతనికి భయమేమిటిలెండి. తండ్రికి ఒక్కగాని ఒక్కకొడుకు! దగ్గర బోలెడంత రొక్కం వుంది. వ్యాపారంకూడా వుంది. పెద్దలోగిలి. భూమీపుట్రాపుంది. అటువంటప్పుడు ఏంచేయవలసినఅవసరం? అసలా తండ్రి పద్దతే అంత! చిచిపటమంటూ వివాహాలు చేసుకుంటున్నాడు. మొదటి భార్య రోగంతో తీసుకొని తీసుకొని, చికిత్సా పథ్యం లేకుండా చనిపోయింది. రెండోభార్య పాముకాటువల్ల మరణించింది. మూడోదాన్ని ఇప్పుడు తీసుకొనివచ్చాడు. ఈమెగతి యెలావుంటో మీరు చూస్తున్నారుగా" అని కొంచెంనేపాగి "నేను చెబుతున్నా

నుగా. వీళ్లు వొట్టి పరమలోభులండి నేను నల్లమందుతినేవాణ్ని! నా కోసం ఒక్క చటాకు పాలుకూడా వీళ్లు తీసుక రాలేదు" అన్నాడు.

ఆ విషయం మారుద్దామనే వుద్దేశ్యంతో మీ రిక్కడే కూచుని వుండండి నేను లోపలికి వెళ్ళి రోగిని ఒకసారి చూచి వస్తాను" అని రిష్టువాచి చూశాను ఒకటిన్నరయింది.

రోగిదగ్గరకు వెళ్ళి చూసినదృశ్యం! నాకళ్ళను చీల్చినట్లయినయ్. ఆ అభాగ్యుడు ఆఖరిగాలి పీలుస్తున్నట్లున్నాడు అతని భార్య విసిరి విసిరి అలసటతో నిద్రపోతూవుంది. చేతిలోని విసన కర్ర అలాగేవుంది. ముఖంమీద విచారరేఖలు కనిపిస్తున్నయ్. ఆమెనొసటిమధ్య ఎర్రని బొట్టు అగ్నిస్ఫులింగంలా జాజ్వల్యమానంగావెలుగుతూవుంది. నే నామెను లేపలేదు. సంచి తెరిచి ఇంకొక ఇంజక్షన్ తయారుచేసి రోగిదగ్గరకువెళ్లి చేయి పట్టుకున్నాను. ఇంకేముంది ? అంతా అయ్యిపోయింది.

బయటకు వచ్చి, మహేంద్రుని గదిలోకి తీసుకొనివెళ్లాను.

నిర్ప్రాణంగా పడివున్న శవాన్నిచూసి మహేంద్రుడు "ఆఖరైందా? వాడికి కొడుకు బతకాల నెందుకువుంది? ఈ మూత పెట్టిన వస్తువేమిటో—?" అన్నాడు.

"పాలనుకుంటాను"

"ఎంగిలి చేసాడా?"

"లేదేమో."

"అయితే వీటిని వూరికినే పోసీయడమెందుకు?" అని మహేంద్రుడు గడగడమని తాగాడు.

ఇంటి కోడలు మేలుకుంది. భయంతోనూ, సిగ్గుతోనూ

విసనకఱ్ఱతో విసురుతూవుంది. ఆ గాలి ఎవరికె తగుల్తుందో ఆ అభాగ్యురాలి కేం తెలుసు?

మహేంద్రుడు అందరికీ చెప్పాడు. ఇల్లంతా యేడుపులతో మునిగిపోయింది. నేను మెల్లిమెల్లిగా బైటకువచ్చి వరండాలో కూచున్నాను. మేనమామగారు వచ్చి నా ఫీజు యిచ్చాడు. ఆ డబ్బు పుచ్చుకున్నాను.

"ఒకసారి వాయించి చూసుకోండి డాక్టరుగారూ. వట్టి వెధవ! పూటా రూపాయలుకూడా యిస్తాడు" అని ఆయన మళ్లీ అన్నాడు.

అదే పడవ మీద ఇంటికి తిరుగు ముఖం పట్టాను. ఆకాశంలో ఒకమూల వెలుతురు రేఖలు ఉదయిస్తున్నయ్! నది మాత్రం ఆ విధంగానే ప్రవహిస్తూ వుంది.

ప్రయాణం ముగిసింది. నావ వొడ్డుకు చేరింది. నేను దిగి భూమ్మీద కాలు పెట్టానో లేదో, ఒక మనిషి నా ఎదుట వినయంగా నిలుచుని "డాక్టరుగారూ! నిన్నటి సాయంత్రంనుంచి మీ కోసం వెతుకుతున్నాను". అన్నాడు.

అతణ్ని నేను గుర్తుపట్టలేక పోయాను. "తమరు ఇక్కడ ఎక్కడుంటున్నారేం?" అని అడిగాను.

"నేనిక్కడుండేవాణ్ని కాదులెండి! నాలుగైదురోజులు షికారు కని ఇటువేపు వచ్చాను."

"మంచిదేలెండి!"

పరకాయించి అతణ్ని చూశాను. నలభై అయిదు సంవత్సరాల వయసుంటుంది. "అయితే తమకి యిప్పు డేం కావాలి?" అన్నాను.

"ఒకసారి తమరు మా యింటికి రావాలి. మా బావమరిది కొన్ని రోజులనుంచి జ్వరంతో తీసుకుంటున్నాడు యింట్లో ఇంకెవరూ లేరు. వస్తారుకదూ? ప్రస్తుతం మేం ఎర్రకోటలో వుంటున్నాం."

"సరేలెండి—"

ఎర్రకోట చేరాను. నాకోసం ప్రాణకృష్ణబాబు ఎదురుచూస్తున్నాడు. ఆయన్ని తీసుకొని లోపలికి వెళ్ళి రోగిని పరీక్షించి మందుచీటి రాద్దామని కూచుని రాస్తూ, మధ్యలో కళ్ళెత్తి చూసాను. ప్రాణకృష్ణబాబు పొరుగింటి డాబా మీదికి తన చూపుల్ని కేంద్రీకరించి చూస్తున్నాడు. తల వొంచుకుని నేను ఆ డాబావేపు చూసాను. ఒకమ్మాయి డాబామీద గుడ్డలు ఆరవేస్తూవుంది. నిర్వికారంగా ఆమె అటూ ఇటూ చూసి మొహం తిప్పుకుంది. మూర్ఖునిలా ప్రాణకృష్ణబాబు నిలుచుని వున్నాడు

బావమరిదికూడా ఈ దృశ్యం చూసినట్లున్నాడు అంత జ్వరంలో కూడా నవ్వుతున్నాడు

హఠాత్తుగా ప్రాణకృష్ణబాబు "ఓహో. ."అని అన్నాడు.

నేను ఆశ్చర్యంగా "ఏమిటండీ?" అని అడిగాను.

"ఏమీ లేదండి .. మీదగ్గర దాపరికమేమిటిలెండి. బైటికి రాండి చెబుతాను."

బైటకు వచ్చాక ప్రాణకృష్ణబాబు "ఇదికూడా ఒక ఇబ్బందేనండి. ఆ పొరుగింటి డాబామీద ఒకమ్మాయిని చూసారు కదూ?" అన్నాడు.

"అవును చూసాను"

ఆయన నా చెవులో "అది నా ప్రేమలోపడి కొట్టుకుం టూవుంది" అన్నాడు.

"మీ కెలా తెలుసు?"

"నేను ఈ గదిలోకి రావడమే తడవుగా ఆమె డాబా మీదికి పరుగెత్తుక వస్తుంది. నన్ను చూడడంతోనే సిగ్గుతో ముఖం ఎర్రగా చేసుకుంటుంది. ఇది ప్రేమ కాకపోతే ఇంకేమి టండీ?"

ఇక నే నేమని చెప్పను? బలవంతాన నవ్వు ఆపుకున్నాను. ఈసమయంలోనే ఒక నల్లటి మనిషి మావద్దకు వచ్చాడు. ఆయన్ను చూసి కృష్ణబాబు సంతోషంతో "రాండి, రాండి; ప్రసన్నబాబుగారూ, రాండి! డాక్టరుగారు వచ్చారు చూడండి. డాక్టరుగారూ! ఈ 'సనాతనబాబు'గారే నన్ను మీవగ్గరికి పంపిం చాడు. మీ కిద్దరికీ పూర్వపరిచయ మనుకుంటాను" అన్నాడు.

అసలు మా ఇద్దరికీ పరిచయమనేది లేదు. అయినప్పటికీ "అవునవును—" అంటూ సనాతనబాబుకు నమస్కరించాను.

"వీరి బావమరిది స్థితి ఎలా వుందండీ డాక్టరుగారూ?— ఏరకమైన జబ్బో తేలిందా?" అని సనాతనబాబు అడిగాడు.

అసలు ఏరకమైనజ్వరమో నాకే తెలియలేదు. షుమా రుగా మలేరియాజ్వరానికి మందు రాసిచ్చాను. నాకూ, రోగికీ అదృష్టం బావున్నట్లయితే - ఈ మందుతో లేచి తిరగ్గలడు.

ఐనా రోగి కుటుంబం ముందు నిజం చెప్పలేక పోయాను. గంద్రగోళంతో తెలిసీ తెలియని విషయాలు చెప్పడంలో గౌరవం వుండదు. ఆ కారణంతో కొంచెం సేపు ఆలోచించి "టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయ్; ఐనప్పటికీ ప్రస్తుతం "క్వైను"

మొదలు పెట్టాను. రెండు మూడు రోజులపాటు చూడాలి" అన్నాను.

సనాతనబాబు పూర్వకాలపు మనిషి! ఒక విధంగా వొదిలే వాడు కాదు. "అయితే నిజంగా మీరు రోగమేమిటో నిర్ధారణ చేయలేరా?" అని అడిగాడు

"ఒక రోజుకూడా గడపలేదు ఏ జబ్బో ఏమిటో ఎలా చెప్పగలమండీ? అంతగా కావాలంటే రక్తాన్ని పరీక్షించినట్ల యితే చెప్పొచ్చు."

"ఇది పరీక్షించాలి, అది పరీక్షించాలి అనేది మీ కిప్పుడు ఒక ఫ్యాషన్ అయిపోయింది లెండి కానీ, మా కాలంలోని డాక్టర్లిదేమీ చేయరు. మా హేమంత డాక్టరుగారు " అని పెద్ద లెక్చరొకటి దంచాడు.

ఆ లెక్చరులో హేమంతబాబు నాడి చూసి కడుపులో కురుపులున్న సంగతీ మొదలైనవి తెలుసుకునేవాడు డాక్టర్ రమేష్ ఫొటో చూసి జ్వరమున్నదీ లేనిదీ చెప్పేవాడు డాక్టర్ విశ్వంబర్.. కవిరాజు . ..హరికిశోర్ కాంపౌండర్,— వీళ్ళంతా చికిత్సా శాస్త్రంలో అద్వితీయులని, మహా గొప్పవారనీ అన్నాడు.

అంతా విన్నాక నవ్వి "మీరు చెప్పింది నిజమే! మేము వాళ్ళకు సమానులంకాము. అంత చదువు మేము చదువుకో లేదు." అన్నాను.

ఆమాటకు 'సనాతనబాబు' అనే టైటిల్ సంపాదించు కున్న ప్రసన్నబాబు సంతోషించి "అవును ఆ కాలమే వేరు. మా చిన్నతనంలో ఎంతో తిండి తినేవాళ్ళం! కడుపునిండా తిన్నాక నేను రెండుశేర్ల రసగుల్లాలు, మామిడిపండ్లూ తినేవాణ్ణి! అంత

దూరం చేనికి? మీరు మేకను వండించుకొని తినగలరా?" అన్నాడు.

"లేదు, అటువంటి సామర్థ్యం నాలో లేదు."

"అటువంటప్పుడు ......."

ఈ 'అటువంటప్పుడు' అనేదానికి నే నేమని జవాబు చెప్పను? ఆలోచిస్తుండగా 'సనాతనబాబు' చొక్కా విప్పి, పిడికిలి బిగబట్టి, చేయి పైకెత్తి "నావేపుచూడండి—" అనిఅన్నాడు.

అతనివేపు చూసాను. ఛాతీ, చేతుల కండరాలు బలిసి మెలి తిరిగి వున్నయ్. దాదాపు అరవై సంవత్సరాల వయసుంటుంది. ఇంతవయసులో కూడా, ఆ శరీరం ఇంత బలంగా వుండడం నిజంగా ఆలోచించవలసిన విషయమే!

"కొంచెం నా నాడి పరీక్ష చేస్తారా?" అని అడిగాడు.

ఆయన నాడి చూసాను. రక్తపుపోటు వున్నట్లుంది. ఆ సంగతే మర్మంలేకుండా చెప్పాను. ఆయన నవ్వి "రక్తపు పోటనేది దాక్టర్లకు చాలా తేలికమాటగా మారిపోయింది. ఏం తెలిసినా, తెలియకపోయినా ఆమాటని ఒక ఫ్యాషన్‌లాగా వాడుతున్నారు." అన్నాడు.

నేనేమీ మాట్లాడలేకపోయాను. ప్రాణకృష్ణబాబు ఆయన్ని ఒకవేపుకు తీసుకొనివెళ్ళి ఏదో చెప్పాడు. ఆమాటలఅర్థమేమిటో గాని సనాతనబాబుకూడా ఆ డాబావేపు చూసి, మీసాలచాటున నవ్వుకుని "అదా సంగతి! సరే. ఈ రోజుల్లోని ఆడపిల్ల చేయలేని పనేముందిలే!" అన్నాడు.

వయసు గడిచిపోతున్న ప్రాణకృష్ణబాబుమాత్రం పిచ్చివాడా ఏమిటి?

ఫీజు తీసుకొని ఇంటికితిరిగి వచ్చేసాను.

అంతా పడుకున్నారు. రాత్రి ఎంత పొద్దుపోయిందో తెలియదు గడియారం ఆగిపోయింది.

"డాక్టరుగారూ?"

తొట్రుపడుతూ బైటికి వచ్చేప్పటికి చేతిలైటుతో ఒక మనిషి గుమ్మంముందు నిలుచుని వుండడం కనిపించింది

"ఏం కావాలోయ్?"

"శ్రమఅని అనుకోకుండా దయవుంచి ఒకసారి సనాతన బాబుగారింటికి రావాలండి?"

"ఎందుకేమిటి?"

"ఆయనగారు దొడ్లోకి వెళ్లి తిరిగి వచ్చినప్పట్నుంచి స్మృతిలేకుండా పడిపోయాడు బాబూ"

తప్పనిసరిగా ఆయన ఇంటికి వెళ్లాను. సనాతనబాబు ఆపాదమస్తకం దుప్పటి కప్పుకొని పడుకుని వున్నారు భార్య వల దగ్గర కూచుని, విచారంగా విసనకర్రతో విసురుతూవుంది

"సనాతనబాబూ, ఓ సనాతనబాబూ?" అని పిలిచాను.

జవాబు లేదు.

"సనాతనబాబూ మీ చేయి కొంచెం ఇటు చాపండి"

జవాబు లేదు.

దుప్పటి లాగివేసాను. సనాతనబాబు చనిపోయి వున్నాడు

ఆ శరీరంలోని ప్రతి అంగంకూడా దృఢంగానే వుంది. కండరాలు మెరుస్తూనే వున్నయ్ కేవలం ప్రాణం మాత్రం లేదు బహుశా పక్షవాతం వల్ల చనిపోయి వుండొచ్చు!

విచారంతో ఒంటరిగా తిరిగి వస్తున్నాను. ఆ వగ్గర్లోవున్న చీకటిసందులోంచి "డాక్టరుగారా ఏమిటి? డాక్టరుగారూ?" అని పిలవడం వినిపించింది.

"ఎవరది?"

ఆ సందులోంచి ప్రాణకృష్ణబాబు రావడం చూశాను. నా దగ్గరికివచ్చి మీ టార్చిని కొంచెం యిస్తారా?" అని అడిగాడు.

"ఎందుకేమిటి?——"

"ఇవాళసాయంకాలం ఆ అమ్మాయి ఒక కాగితం విసిరి వేసింది. అదొకవేళ ప్రేమలేఖ అయివుంటుందేమో?"

ఆ సందు ప్రాణకృష్ణబాబు ఇంటికీ, ఆ అమ్మాయి ఇంటికీ మధ్యనవుంది. నా కూడా కుతూహలం కలిగి టార్చి తీసుకొని ఆ సందులోకి వెళ్ళాను.

ఆ సందు మహాఅసహ్యం! ప్రపంచంలోని చెత్తా చెదారమూ, కుళ్ళుకంపు యావత్తు అక్కడేవున్నట్లుంది. టార్చివేశాను. ఒక కాగితపుపొడ పెంటకుప్పమీద పడివుంది. ప్రాణకృష్ణబాబు వొంగి ఆ కాగితాన్ని తీసుకుని, విప్పిచూశాడు. అందులో కొన్ని వెంట్రుకలు వున్నయ్!

ఆ అమ్మాయి తలదువ్వుకొని వూడిపోయిన వెంట్రుకల్ని పొట్లంగా కాగితంలో చుట్టి పారవేసివుంటుంది.

"చూస్తున్నారా డాక్టరుగారూ?"

" ఆ చూస్తూనే వున్నాను. మరి ఉత్తరం ఏది? ఇందులో వెంట్రుకలు వున్నయ్. పారవేయండి"

"డాక్టరుగారు నిజంగా రసికులుకారు, ప్రియురాండ్రు తమప్రియులకు వెంట్రుకలు బహుమానంగా పంపిస్తారని మీకు

ఇంగ్లీషు నవలల్లో చదవలేదా? ఇది కూడా అటువంటి బహుమాన చిహ్నమండీ.''

తీక్షణంగా ఒకసారి ప్రాణకృష్ణబాబు చూపుల్లోకి చూసాను. అతనిచూపులు పిచ్చివాడి చూపుల్లా వున్నాయ్.

నిజంగా ఇతను పిచ్చివాడే!

ఇంట్లో ఒక మనిషి ప్రాణాపాయంలో వున్నపుడు, ఈయన ఇంతవయసులోకూడా అర్ధరాత్రి ప్రేమోపహారాన్ని వెద కుతూ వున్నాడు. ఇటువంటి పిచ్చివాడివిషయం ఒకసారి ఏదో నవలలో చదివిన జ్ఞాపకంవచ్చింది. ఒక వేసు కండ్లతో చూసాను. ఆ మనిషి "అయిదవజార్జి చక్రవర్తి తనదగ్గర అప్పుతీసుకున్నా డనీ, జార్జి చక్రవర్తి ఆ అప్పును తీర్చకూడదని నిశ్చయించుకున్నా డనీ" అంటుంటాడు. అన్నిపనులూ జాగ్రతగా వేసుకుంటాడు. ఈ విషయంలోనే ఆయనకి పిచ్చి' ప్రాణకృష్ణబాబుకూడా బహుశా అలానే ఆడపిల్లలు తనను చూడడంతోనే ప్రేమిస్తున్నా రని భ్రమపడుతున్నాడేమో!

"మీ బాపమరిదికి ఎలావుంది?" అని నే నడిగాను.

వెంట్రుకల పొట్లాన్ని జేబులో పెట్టుకొని "రాత్రింబవళ్లు ఇరవైనాలుగ్గంటలూ ఈ అప్సరసకోసం తిరుగుతూ వున్నాను. వూపిరి పీల్చుకొనేందుకే నాకు సమయం దొరకనప్పుడు వాడి మంచి చెడ్డల్ని చూసేంత టైంకూడా వుండడంలేదంటే మీరు నమ్మరు. నాలుగైదుసార్లు ఆ పిల్ల డాబామీదికి వస్తుంది. పది సార్లు కిటికీలోంచి తొంగిచూస్తుంది. ఇంకేం చెప్పమంటారు; దాంతో నా అవయవాలన్నీ. '' ఆయన ఇంకా ఏదో చెప్ప బోయాడు.

"సరే, ఇక ఇంటికి వెళ్ళండి?" అన్నాను.

మాట్లాడకుండా నావేపు తమాషాగాచూసి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చి మంచంమీద పడుకుని ప్రాణకృష్ణ బాబు పిచ్చివాడేమోనని ఆలోచిస్తున్నాను. నా కేమీ అతని పరిస్థితి అంతుపట్టడంలేదు. సరి నే నేమంత తక్కువవాణ్ని! ఎవరి నవ్వునూ, సిగ్గునూ ఆధారంగాతీసుకొని గాలిమేడలు కడుతూ వున్నానో, ఆమె నన్ను గడ్డిపూచంతగా కూడా కోరడంలేదేమో! ఆ డాబామీది పిల్లమాదిరిగానే, 'ఆమె' కూడా నా మీద ఉదాసీనంగా వుందేమో! నేనుకూడా ప్రాణకృష్ణబాబుమాదిరిగా సంకీర్ణమైన చీకటితోకూడిన మురికి వీధుల్లో తిరుగుతూ వున్నానేమో!

వర్షం వచ్చింది. ఉదయం లేచి చూసేప్పటికి మేఘాలు తిరుగుతూవున్నాయ్. ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూనే వుంది. మేఘాలు గర్జిస్తూనే వున్నయ్! అటువేపు పొగడచెట్టు వుంది. అసంఖ్యాకమైన పూలు చెట్టునిండా వికసించి వున్నయ్.

ఇవాళ ఏమీ పనిలేదు. మంచంమీద పడుకునే వర్షపు చినుకుల్ని చూస్తున్నాను.

"ఆషాడస్య-ప్రథమ దివసే' అనేది గుర్తుకు వస్తూంది. కానీ, ఇవాళ తృతీయం—'

"డాక్టరుగారూ?"

"లోపలికిరా"

టెలిగ్రాం ప్యూను లోపలికి వచ్చాడు. సంతకంచేసి పంపించి, టెలిగ్రాం విప్పి చదివాను.

"తొందరగా బయలుదేరండి. నాగేంద్రుడు జబ్బుగా వున్నాడు.'

నా కవిత్వం ఆగిపోయింది. నాగేంద్రుని విషయం అలా చెప్తున్నాను. ఆయన బిహారి బ్రాహ్మణుడు. పైగా నాకు ముఖ్య స్నేహితుడు. ఫీజుకూడా ఇస్తుంటాడు. మొదట్లో వద్దనేవాణ్ణి. చిన్నబుచ్చుకుని "ఇది మీ వ్యాపారం! ఫీజు ఇచ్చే సామర్థ్యం నాకుంది. పైగా నేను స్నేహితుడిని కాబట్టి తప్పకుండా ఫీజు పుచ్చుకుని తీరాలి. ఏ రోజునైతే ఫీజు ఇవ్వలేని సామర్థ్యం నాకు వుండదో, ఆనాడు నువ్వు వూరికినే నాకు మందును యిస్తువుతే " అని అంటూండేవాడు.

నాగేంద్రుడు 'మోతీహారం'లో వుంటూండేవాడు. ట్రైనులో వెళ్లాలి. మూడుచోట్ల బండి మారాలి. అందులో ఎడతెరిపిలేని వర్షం కురుస్తూవుంది. నాగేంద్రుడేమో జబ్బుగా వున్నాడు. వెళ్ళక తప్పదు.

ఆ వర్షంలోనే స్టేషనుకి బయలుదేరాను. గుర్రబ్బండి ముందుకు వెళ్ళలేక పోతూవుంది. దారంతా బురదమయం. బండివాడు గుర్రాన్ని కొరడాతో కొడుతున్నాడు. దాని నడకలో ఏ మాత్రం కూడా మార్పు రాలేదు;

ఛళ్లుమని వినిపించింది.

"ఏందుకలా కొడతావోయ్?"

"బండి దొరకదు బాబుగారూ!"

"అవునోయ్—"

గడియారం చూసాను. బండికి ఇంకా ఇరవై అయిదు నిమిషాల పైముంది. మైలున్నర వెళ్లాలి. టిక్కెట్టు కూడా కొనాలి!

'ఛల్—ఛల్'మని కొరడాదెబ్బలు వినిపించాయి. కొంత దూరం వెళ్లాక కొంచెం మెరక ఎక్కవలసి వచ్చింది. బండి

మెరక ఎక్కుతున్నప్పుడు, ఎవరో మనిషి దారిని దాటుతూ కాలు జారి బండికిందకు దొర్లుకువచ్చాడు.

"బండిని ఆపవోయ్. ఎవరో బండికింద పడ్డారు."

ఒక గడియలో బండివాడు బురదతో మునిగిపోయిన ఒక మనిషిని తీసుక వచ్చాడు. పై పెదివి పగిలింది. పెదిమనుంచి రక్తం కారుతూవుంది.

"ఎవరూ—? అరే ప్రాణకృష్ణబాబా! ఈ వర్షంలో ఎక్కడికి వెళ్తున్నారు. రాండి. లోపలికి వచ్చి కూచోండి. ఎక్కడికి వెళ్తున్నారేం?"

ఆయన ఆయాసపడుతూ "ఇక్కడికే. కొంచెం స్టేషన్ దాకా వెళ్ళొద్దామని బయలుదేరాను. ఆ అమ్మాయి ఈ బండికి అత్తవారింటికి వెళ్తావుంది. వీడుకోలు ఇద్దామని ఆః! ఆఖరి దర్శనం మరిచిపోలేనిదిగా హృదయంలో హత్తుకుపోతుందిసుమా." అని నవ్వాడు.

పగిలిన పెదిమనించి రక్తం కారుతూనే వుంది. చివరకి మేమంతా స్టేషనుకి చేరుకున్నాము. టికెట్ కొనుక్కొని, బండ్లో కూచునిఒక్కసారి బైటకు చూసాను. ఎడతెరిపిలేని ఆ వర్షంలో ప్రాణకృష్ణబాబు ప్లాటుఫారంమీద, ఆవేపునుంచి ఈ వేపుకు పరుగెత్తుతూ ప్రతి బండ్లోకి చూస్తున్నాడు. ఆయన వెతికే మనిషి ఎక్కడుంది? ఆ సౌమ్యముఖం ఎక్కడుంది?

తిరిగి తిరిగి ఆఖరికి ఆడవాళ్ళ పెట్టె దగ్గరకు వచ్చి హాండిల్ పట్టుకున్నాడు. తలుపు తెరిచేందుకు సిద్ధంగా వున్నట్లు ఆ వాలకం కనబడుతూవుంది. ఎవరో రైల్వే వుద్యోగి వెనక

నుంచి ఆయన్ను పట్టుకుని ఒక తోపు తోసి 'ఇది ఆడవాళ్ళ పెట్టెఅని తెలియదూ? దిగు బండి కదులుతూవుంది" అన్నాడు.

బండి మెల్లిమెల్లిగా కదిలింది.

ప్రాణకృష్ణబాబు మూర్ఛడిలా నిలుచునిపోయాడు. ఆయన కళ్ళల్లో పిచ్చివాడి ఛాయాలు కనిపిస్తున్నాయ్. వొంటినిండా బురద! పగిలిన పెదిమనుంచి రక్తం కారుతూనేవుంది. గాలిని తుచ్ఛంగా పరిగణించి రైలుబండి ఇనపబద్దెలమీద పరుగిడుతూవుంది

పొలాన్ని, ఆడవుల్ని, నదుల్ని, పర్వతాల్ని వెనక్కి నెట్టుకుంటూ బండి వాయువేగంతో పోతూంది పెట్టెలో నే నొక్కణ్నే'— వొంటరిగా కూచుని ప్రాణకృష్ణబాబు సంగతి ఆలోచిస్తున్నాను; రానురాను మానవజాతి ఎంత కిందికి దిగజారి పోతోంది!

నాలుగువేపులా వర్షం కురుస్తూనేవుంది వర్షాన్ని, గాలినీ లెక్కచేయకుండానే రైలు పోతూవుంది. వొంటరిగా కూచుని నేనుఆలోచిస్తున్నాను—'ఆమె' ఏనాడుకూడా నాతో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని ఎప్పుడూ చెప్పలేదు. నేనెప్పుడన్నా దగ్గరికివెళ్తే 'ఆమె' దూరంగా పోతూవుంటుంది. నన్నెప్పుడూ 'ఆమె' ఉపేక్షిస్తూనే వుంది భయంకరమైన దొంగవాణ్ణని నన్ననుకుందేమో!—నిజంగా నేను దొంగనైతే, ఎలాగైనా ఆమెను బలవంతంగా ఎత్తుకవచ్చేవాణ్ని' కానీ, నేను సభ్యతా ప్రపంచంలోని మనిషిని! ఇటువంటి విషయాలు, వేషాలు నా కసలు గిట్టవు

పృధ్వీరాజు ఎక్కడున్నాదో—?
సంయుక్త ఎక్కడుందో—?
"నీ మూసిన కవాటముపై తల పగుల కొట్టుకోనా..

ప్రాణాల్లో కొత్తబలం, ప్రణయంలో దృఢవాణీ
హృదయంలో ఊపిరుల్వం, ఉబికినాయి నా లోపల
తలుపు తెరువు నా రాణీ!
సత్వరమే తెరుపు రాణీ.
ఆపలేను ఈ తపనను; ఆగలేను నేనింక
చెబితే 'లేవని' చెప్పు; లేదా కౌగిలించు
తలుపు తెరుపు నారాణీ!"

ఒక క్రమం లేకుండానే ఏమిటేమిటో అందామనిపిస్తుంది. అరుద్దామని బుద్ధి పుడుతున్నా అరవలేకపోయాను. ఈ విగ్రహమే నా జీవితానికి అన్నిటికంటే గొప్పప్రాణెడి.

నాగేంద్రుడి ఇల్లు చేరేప్పటికి ఏడుపులూ, మొత్తుకోళ్ళతో నిండిపోయింది. చిన్న వసారాలో పెద్ద ఆవొకటి పడుకునివుంది. ఆవు వీపుమీద సన్నని తివాచీ పరిచుంది. రోగి ఆవుతోక పట్టుకున్నట్లయితే—గోదానమంత పుణ్యం వస్తుందనీ, మృత్యువుతో ఆఖరిపోరాటం సాగించే రోగి ఈ పని చేయలేకపోయినప్పుడు ఆరోగి వైతరిణీ నదిని దాటలేడనీ, ఇక్కడ ప్రజల్లో పెద్ద నమ్మక మొకటుంది. ఐతే—నాగేంద్రుడు ఆఖరి ఘడియల్లో వున్నాడా?

ఆవు నెలాగో తప్పించుకుని నాగేంద్రుని చూసాను. చాలా నీరసంతోవుండి, జ్వరంతో బాధపడుతూవున్నాడు. రోగికి కావలసిన మందిచ్చి, బైటికి వచ్చి, కాళ్ళూ చేతులూ కడుక్కొని పడుకునేందుకు తయారౌతూవుండగా- పెద్ద వలపాగా చుట్టుకున్న మనిషొకాయన నాముందుకువచ్చి కూర్చున్నాడు. వొళ్ళంతా ఎర్రగావుంది. గడ్డం, మీసాలు నున్నగా వున్నయ్. కళ్ళల్లో

జ్యోతులు వెలుగుతున్నయ్. నొసట ఎర్రని బొట్టువుంది. మనిషి కొంచెం బుద్ధిమంతుడిలా వున్నాడు

ఆయన వీళ్ళ గురువుగారట! నాగేంద్రుడు జబ్బుసంగతివిని అతణ్ని చూసేందుకు వచ్చాడు. ఆ చుట్టుపక్కల జ్యోతిష్యములో ఆయనకు మంచిపేరు ప్రఖ్యాతులున్నయ్. నాగేంద్రుడి జన్మనక్షత్రం తెప్పించి, గుణించి ఈ రాత్రి పన్నెండు గంటలవరకూ మీరు నాగేంద్రుణ్ని ఏదోవిధంగా వూపిరితో వుంచగలిగినట్లయితే, ఆతరవాత అతడికేమీ భయంలేదు ఈ కొన్నిగంటలసేపే అతడికి మహాభయంకరమైనవి డాక్టరుగారూ, పన్నెండు గంటలవరకూ అతణ్ని రక్షించే భారం మీ మీద పెడుతున్నాను. ఆ తరవాత నేనుకూడా చేయవలసిందేదో మొదలుపెట్టబోతున్నాను అని నాతో అన్నాడు

నల్లని చీకటిరాత్రి! ఎన్నిగంటలవుతుందో తెలీదు. ఆకాశంలో నాలుగు వేపులా మేఘాలు అలుముకొనేవున్నాయ్ ఎడతెరిపిలేనివర్షం. మధ్య అప్పుడప్పుడు వురుములు వినపడుతూ వున్నయ్.

నాగేంద్రుడి మంచందగ్గర కూచుని అతనికి మెల్లిమెల్లిగా బ్రాందీని, కొద్దికొద్దిగా యిచ్చాను.

"పులేశ్వరీ—పులేశ్వరీ" నాగేంద్రుడు ప్రలాపించాడు

పులేశ్వరి అతడి మొదటి భార్య! ఆమె చనిపోయి చాలా కాలమైంది. రెండోభార్య దగ్గర కూచుని అతడి సేవలో నిమగ్నురాలై, మరచిపోయున్నా తన పేరును—భర్త ఉచ్చరిస్తాడో లేదో అని కనిపెట్టుక్కూచుంది.

మాటిమాటికీ అదే పిలుపు "పులేశ్వరీ పులేశ్వరీ" అని.

ఆ పక్కగదిలోనించి కులగురువుగారు తన శక్తినంతటినీ ఏకంచేసి—దుష్టగ్రహానికి శాంతి చేస్తున్నాడు. పవిత్రమైన హోమాగ్నిగుండంలోని పొగ ఇక్కడికి కూడా వస్తూవుంది. మధ్య మధ్య హోమగుండంలోంచి 'గప్' మంటూ వెలుతురు వస్తూవుంది.

గడియ గడియకూ నేను నాగేంద్రుడికి బ్రాందీ ఇస్తూనే వున్నాను. మధ్యలో అతను 'పుమేశ్వరి' అని కలవరిస్తూనే వున్నాడు. రెండో భార్య మాటిమాటికీ కన్నీళ్ళు పైటకొంగులో తుడుచుకొంటూనే వుంది.

పైట మేఘాలు, వురుములు, వర్షం.

హఠాత్తుగా అన్నీ ఆగిపోయినయ్. మేఘాల గర్జనలు తగ్గినయ్. ప్రకృతి శాంతించింది. ఆ సమయంలోనే నాగేంద్రుడు కళ్లు తెరచి నా ముఖంవేపు చూసి మెల్లిగా "ఎప్పుడొచ్చావు?" అని అడిగాడు.

ఆ తరవాత భార్యవేపుచూసి "కమలా! కొంచెం నా తల గడదింప్పి సరిచేయి' అన్నాడు.

భార్య కృతార్థురాలైంది!

కులగురువు "ఎన్నిగంటలయిందో చూడండి." అని అనడం వినిపించింది.

నా గడియారాన్ని చూసాను. 'పన్నెండు పదినిమిషాలు!'

నాగేంద్రుడు బ్రతికాడు

నాగేంద్రుడు కోలుకున్నాడు. ప్రాణకృష్ణబాబు బావమరిది ఆరోగ్యవంతుడై తన పిచ్చిమామను తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు.

నా ప్రాక్టీసు మునుపటికంటే ఎక్కువయింది దాంతో పాటు నాలోని '<u>దాహం</u>' కూడా ఎక్కువైంది

పైటికి నేను సభ్యతా మానవుణ్నే! కానీ, నాహృదయంలో బర్బరత్వం దాగా పాతుకునిపోయింది. మొదటియుగం తాలూకు మానవుడు క్షణ క్షణానికీ, సంపూర్ణమైన సభ్యతా మానవుణ్ని లోబరుచుకొని, బైటికిసట్టి—సీరికి తిలోదకా లిచ్చింది తన వాస్తవిక రూపాన్ని నాద్వారా బైట పెట్టేందుకు ప్రయత్నిస్తు న్నాడు. నీతిశాస్త్రంలోని ఉపదేశాలు అతని చెవికెక్కడంలేదు. కానీ—ఎప్పుడో ఒకప్పుడు ఈ సభ్యతా వేషాన్ని వొదిలి, పసు వులా వివస్త్రుడనై—నన్ను సమాజ మధ్యంలో తిప్పుతుందా యేం?

నా మనసులోని ఈ అశాంతినీ, ద్వంద్వాన్నీ, నన్నూ చూసి—ఎవరైనా అనుమానించేందుకు ఆస్కారముందా?—

"డాక్టరుగారూ—?"

"రాండి రాండి, నమస్కారం, కూర్చోండి "

"కూర్చునేంత వ్యవధి లేదండి. తమ రిప్పుడే నాతోపాటు 'రాంగంజ్'కి—బయల్దేరాలి. అక్కడ కలరా మొట్టుకుంది"

"సరే పదండి—"

## 3

"నీకు నామీద ప్రేమ వున్నదా—లేదా?"

జవాబులేదు.

"చెప్పవేం?—"

జవాబులేదు.

"చెప్పవా?—"

"ఏమని చెప్పను"

"నన్ను ప్రేమిస్తున్నావా—లేదా?"

"నాకు తెలీదు." అని 'ఆమె' వెళ్ళిపోయింది.

మూర్ఖుడిలా కూచుని చూస్తున్నాను. 'ఆమె' నన్ను నిజంగా ప్రేమించడంలేదా?— హృదయం మటుకు ఈ సంగతిని ఒప్పుకోవడంలేదు.

"హృదయంలో జ్వాలని వెలిగించీ
మధురాతి మధుర ప్రేమను కలిగించీ
నా కోరిక నెందుకు త్రోస్తావు
నాకెందుకు బాధను యిస్తావు."

'ఆమె' తిరిగివచ్చి నా వెనక నిలుచున్నట్లుంది. నేను తిరిగి ఆమెను చూడలేను. రాసుకుంటూనే వున్నాను. ఆమె చీర చెంగు నా వీపుకు తగులుతూన్నట్లుంది. ఆమె ముఖం సిగ్గుతో ఎరుపెక్కినట్లుంది. ఆవేశంతో పెదిమలు వణకుతున్నట్లున్నయ్.

"చూపులతో పడు యమయాతన
నా హృదయములో ఆవేదన
బాధపడే దీనుణ్ణి
మరిచావా ప్రేయసి
మరిచావా నా రాణీ!"

'ఆమె' ఇంకా దగ్గరికి వచ్చింది. నేను ముఖం మాత్రం తిప్పలేను. నాలో ఆత్మాభిమానం లేదా? కేవలం అనునయ వినయాలు తప్ప, నా కవిత్వంలో ఆ అభిమానం ఎప్పుడూ అంకితం కాలేదనుకుంటాను.

'ఆమె' నా వెనకనించి వంగి, రాసుకుంటున్న నా కవిత్వాన్ని చదువుతూవుంది. నేను తలతిప్పాను. 'ఆమె' కనబడలేదు.

"నువ్వెవ్వరివి?—"

నా ముందెవరో ఒక అపరిచిత భయపడుతూ నిలుచుని వుంది. చేతులెత్తి నా మాటకి "బాబుగారూ! చాలా ఆపదలో వున్నాను బాబూ! మీరు దయామయులని విని...." మిగతా మాటలు బైటికి రాలేకపోయినయ్.

"పగలు రావడానికి నీకు తీరుబడి కలగలేదా?"

"పగలు తమరు పనుల్లో నిమగ్నులై వుంటారని, తీరుబడి వుండదని... "

"నీకు జబ్బేమిటి?—"

ఆమె మాట్లాడలేదు. ఆమె వంటినిండా పెద్దపెద్ద మచ్చలు వున్నయ్! ముక్కు కొంచెం వాచివుంది. పెదిమల అంచున కూడా మచ్చలు వున్నయ్. కండ్లు ఎర్రగా వున్నయ్ కొంపతీసి ఈమెకు కుష్టువ్యాధి కాదుకదా?

"ఇలా నీవొంట్లో ఎంతకాలంనించి వుంటూవుంది?"

"రెండు నెలలయిందండి . ."

"ఇంజక్షనులు పుచ్చుకోవాలి. డబ్బు ఖర్చుపెట్టాలి"

"నేను చాల బీదదాన్నండి. నామీద దయచూపించండి .. భగవంతుడు మీకు మేలుచేస్తాడు"

"భగవంతుడు వొప్పుకున్నాడా?"

నా వుద్దేశ్యం గ్రహించి నట్లుంది. "నాకు—నాకు నయం చేయండి బాబూ! రక్షించండి—రక్షించండి." అనిఅంటూ చేతులు చాచి నా రెండుకాళ్లు పట్టుకుని ఏడ్చింది.

ఏదో విధంగా కాళ్లు విడిపించుకున్నాను. "సరే - నాకు ఫీజు ఇవ్వొద్దు. మందు ఖరీదైనా ఇస్తావా?" అన్నాను.

"నా దగ్గరేమీ లేదు బాబూ. తమవంటి దయామ...."

"నోరుముయ్—"

చీటి రాసి, దాంతోపాటు ఒక రూపాయకూడా ఇచ్చి "ముప్ఫైరెండు మాత్రలు యిస్తాడు. ఇక నా దగ్గరకు రానవసరములేదు. ఈ మందుతో నీ జబ్బు నయమవుతుంది" అన్నాను.

ఆమె నమస్కరించి వెళ్లిపోయింది.

ఏమాత్రమన్నా ఆమె నాకు డబ్బు ఇచ్చినట్లయితే—ఇంత అశ్రద్ధ చేసేవాణ్ని కాదు. ఏమీ ఆలోచించకుండానే వేడిని తగ్గించే మందు రాసిచ్చాను. ఈవిధంగా నడవడం నా జీవితానికి మంచిదేనా?—

# 4

"క్షమించాలి హరీష్‌బాబూ! ఈపని నాతో కాదు."

అతనే మా పొరుగింటి హరీష్‌బాబు వచ్చాడు. ఏదో దుకాణంలో గుమాస్తాగా వుంటూ, ఒక ఇన్‌ష్యూరెన్సు కంపెనీకి ఏజెంటుగా వుంటున్నాడు. నే నా కంపెనీకి డాక్టరుగా వ్యవహరిస్తున్నాను. ఆకారణంతోనే ఒక్క మనిషిని భీమా చేయించేందుకు నా దగ్గరికు తీసుకొని వచ్చాడు. మనిషిమాత్రం పైకి లావుగా కనిపిస్తున్నాడు. అతనికి మధుమేహం వుంది; హృదయం చాలా దుర్బలంగా వుంది. అతని విషయంలో మంచి రిపోర్టు వ్రాయమని హరీష్‌బాబు నన్ను బతిమిలాడుతున్నాడు. ఆరోగ్యం సరిగా

లేనట్లయితే 'కంపెనీవారు అతడి భీమాని ఒప్పుకోరు. అందు కనే నేను పై మాటల్ని హరీష్‌బాబుతో అన్నాను. పగలును రాత్రిగానూ, రాత్రిని పగలుగా చెప్పడం నాకు విరుద్ధం!

"ఎంతో ప్రాధేయపడి—బతిమిలాడి ఆయన్ను భీమా చేయించేందుకు ఒప్పించాను. నా కష్టాన్ని, శ్రమనీ మీరు రెండు నిమిషాల్లో తేల్చివేశారు! మీకు నా పరిస్థితి తెలియంది కాదు. నెలరోజుల్నుంచి పిల్లవాడు మంచం పట్టాడు. మందుకని, మాకు కని, పథ్యాలకని నా నడుములు విరిగిపోతున్నయ్! ఈ మనిషితో భీమా చేయించినట్లయితే నాకు నాలుగు డబ్బులు గిట్టుబాటవు తయ్. ఆలోచించండి" అని హరీష్‌బాబు మళ్ళీ అన్నాడు.

"ఐనప్పటికీ ఈపనిమాత్రం నాచేతకాదు హరీష్‌బాబు. క్షమించండి."

"క్షమాపణ నేను కోరుకోవాలి డాక్టరుగారూ! అదృష్ట మనేది నా కెప్పుడూ ఎదురు తిరుగుతూనే వుంది. పోనియ్యండి .. మా అబ్బాయికి నయమవుతుందో లేదో చెప్పండి—"

"అది టైఫాయిడ్ జబ్బు!"

"నా పిల్లవాడి పరిస్థితి తెలిసుండికూడా మీరు నాకు సహాయం చేయలేరా—?"

"క్షమించండి—"

హరీష్‌బాబు కొంచెంసేపు వూరుకొని ఆతరవాత "సరే! మా అబ్బాయికి మందు రాసివ్వండి" అని అడిగాడు.

"విటమిన్ డి—"

హరీష్‌బాబు నా చేతులు రెండూ పట్టుకుని "డాక్టరుగారూ

నేను ప్రతి దమ్మిడీకి గడ్డి కరవాలి....తమ రేవిధంగా నైనా ఈ కేసుని—" అని అన్నాడు.

"ఐతే ఒకపని చేయండి. ఈ పదిరూపాయలు........"

నామాట పూర్తికాకముందే ఆయన నాచేతులు వొదిలి పెట్టి "తమ రిలా నన్నవమానపరుస్తారా? ఈనాడు నా అదృష్టం ఇలా వుండి బికారినయ్యాను. పూర్వం ఈ వూరికి చుట్టుపక్కల ఇరవై అయిదు మైళ్ళ దూరం వరకూ మా గొప్పతనాన్ని గురించి పొగుడుకునే వంశంలో పుట్టాను. 'రతన్‌గంజ్' బ్రాహ్మణుల పేరు అందరికీ తెలుసు. ప్రతిరోజూ మా పెరట్లో రెండువందల మంది భోజనం చేయడంకూడా చూసాను. అటువంటి వంశం లోనివాడికి ఈనాడు మీరు పదిరూపాయలు దానం చేయాలని చూస్తున్నారు.....మీకు—" హరీష్‌బాబు చెప్పలేకపోయాడు. గొంతు బొంగుపోయింది. కళ్ళు చెమ్మగిల్లినయ్.

నేను నిశ్చలంగా రాతిబొమ్మలా నిలుచున్నాను. హరీష్ బాబు వెళ్తూ "నమస్కారమండి. వస్తాను" అంటూ వెళ్ళి పోయాడు.

ఆ సాయంకాలం వాళ్ళ పిల్లవాణ్ని చూద్దామని వాళ్లింటికి వెళ్ళాను. హరీష్‌బాబు ఇంట్లో లేడు. ఆయన భార్య "ఇది టైఫా యిడ్ జ్వరమని మీరు ఆయనగారికి చెప్పారట. కానీ, పిల్లవా డేదో కలవరిస్తూ, మధ్యమధ్య త్రుళ్ళిపడుతూవుంటాడు."అన్నది.

టైఫాయిడ్‌లో అలానే వుంటూంటుంది.

"అయినా—ఒకనాడు మీ యింటిదగ్గర ఎవరో పిచ్చిది పిల్లవాణ్ని పట్టుకుందట. అదేమన్నా పిల్లవాడికి మంత్రం పెట్ట లేదుకదా?"

"లేదు లేదు. అటువంటిదేమీ జరగలేదు."

నేనేమీ జవాబు చెప్పలేదు. క్షణంసేపు వూరుకొని "ఈ మందును జాగ్రత్తగా వాడండి; విటమిన్ డి; ప్రతిరోజు పది పన్నెండు చుక్కలు పాలల్లో కలిపి ఇవ్వండి" అన్నాను.

"మరి-దీని ఖరీదు?"

ఖరీదుపెట్టి కొనలేదులెండి. ఏదో శాంపిల్ రూపేణ నాకు వచ్చింది"

అబద్ధంలోని ఆనందాన్ని నేనింతవరకూ అనుభవించలేదు.

హరీష్‌బాబు అప్పుడేవచ్చి నాతో "మీరు తోసివేశారు. ఆతరువాత ఆలిండియా ఇన్స్యూరెన్సు ఏజంటు ఆ కేసు పుచ్చుకున్నాడు. డాక్టరు ఖగేంద్రనాధ్ ఫస్టుక్లాసు రిపోర్టు రాసిచ్చాడు. ఆరిపోర్టును నేను కళ్లారా చూశాను. మీరేమో—" అని ఆగాడు.

ఆయన భార్య "చూడండి ఒక ఆయిల్‌క్లాత్ తీసుకొని రాండి. పక్క గుడ్డలు మాటి మాటికీ తడుస్తున్నయ్." అన్నది.

"సరే—" అని హరీష్‌బాబు అన్నాడు.

"గ్లూకోజ్ కూడా అఖరైపోయింది. మరిచిపోకుండా అది తీసుకరాండి"

నాలో అశాంతి వ్యాపించింది. "ఇక నేను వెళ్తానండి" అన్నాను.

సరిగ్గా అర్ధరాత్రికి హరీష్‌బాబు కొడుకు చనిపోయాడు. తల్లి హృదయవిదారకంగా ఏడుస్తున్న ఆక్రందన మెల్లిగా వినిపిస్తూవుంది. ఆ దగ్గర్లోని కార్ఖానా గొట్టంలోంచి ఎవరో పిచ్చిది నవ్వుతున్నట్లుగా—గుప్‌గుప్‌మంటూ పొగఆకాశాన్నంటుతూవుంది.

ఏదో తప్పుచేసినట్లుగా నామనసంతా బాధపడింది. ఆ పిల్ల వాడిపట్ల నేను చేయవలసిన శుశ్రూష, జాగ్రత్త—సరిగ్గా చేయ లేదేమో! తడిసిన బట్టలమీద పడుకోవడంచేతా—సరైన పథ్యం లేకా చనిపోయాడు. కానీ, హరీష్‌బాబు చిన్న పిల్లవాడికి మాత్రం టైఫాయిడ్ తగలలేదు. ఈ పిల్లవాడు ఏ విధంగా చనిపోయాడు? బహుశా పేదరికంవల్ల కామోలు!

హరీష్‌బాబుకు ఆకేసు విషయంలో అతను కోరినట్లుగ రిపోర్టు రాసిచ్చినందువల్లకలిగే నష్టమేమిటి? నే నివ్వకపోయినా, ఆఖరికి ఖగేంద్రుడు రిపోర్టు రాసిచ్చాడు. మరి నా ఆలోచనలు ఆశయాలు అన్నీ తప్పుడువేనా? అతను మధుమేహంతో లావుగా వుండి, బలహీనమైన హృదయంతో చాలా రోజులవరకు—అంటే చాలా సంవత్సరాలవరకు బతకవచ్చు! నేను మంచివాడని భావించి, మంచి రిపోర్టు రాసిచ్చిన మనిషి రెండు రోజుల తర వాత చనిపోకూడదా? ఇదెవరికి తెలుస్తుంది? హరీష్‌బాబుకు వచ్చే డబ్బును నే నన్యాయంగా పాడు చేసాను. ఇందులో ఔచి చిత్య మెక్కడుంది? నిజమేమిటి?

నా కెప్పుడు నిద్రపట్టిందో తెలీదు. కలగంటున్నాను. 'ఆమె' వచ్చింది. లతల్లాంటి చేతులను నా మెడచుట్టూవేసి, నన్ను ముద్దు పెట్టుకొని "నువు చేసింది మంచిపనే! ఎందుకంతగా బాధ పడతావ్?" అన్నది.

మెలకువ కలిగింది. లేచి చూచేప్పటికితెల్లవారబోతూంది. హరీష్‌బాబింట్లోంచి ఇంకా సన్నగా ఏడుపుధ్వని వినిపిస్తూనే వుంది. ఎదురుగావున్న కార్ఖానా గొట్టంలోంచి, నల్లని పొగ సుళ్లు తిరుగుతూ, ఫక్‌ఫక్ మంటూ—ఆకాశంలోకి పోతూవుంది.

# 5

"నేనిప్పుడే 'రసూల్‌పురం' వెళ్లాలి. నాకక్కడ అర్జంటు పనుంది" అన్నాను.

ఆ మాటతో గొల్లవాడు మెదలకుండా నిలుచున్నాడు. రసూల్‌పురంలో జమీందారుగా రుంటారని, అక్కడికి నేను వెళ్లాల్సిన పనుంటుందని వాడికి తెలుసు. నేను ముందుగా అక్కడికి వెళ్లాలి. అటువంటప్పుడు వాడు నన్ను తనవూరికి తీసుక వెళ్ళగలుగుతాడా? బీదవాడు ప్రతిసారీ ఫీజివ్వలేడు. తన శక్తికొద్దీ అప్పుడపుడు పాలూ, పెరుగూ ఇచ్చి తన కృతజ్ఞతను వెల్లడించుకుంటాడు.

"అక్కడ్నుంచి తిరిగి వచ్చేప్పుడు మీ వూరికి వచ్చి చూస్తాను. మరిచిపోను. నువు ఇంటిదగ్గరే వుండు—"

వాడు వెళ్లిపోయాడు. రాసుకునేందుకు కూర్చున్నాను.

"బాగా వున్నారా డాక్టరుగారూ?"

ఎవరబ్బా?—తలెత్తి చూసాను. మహేంద్రుడు నిలుచుని వున్నాడు.

"కుశలమేనా?—" ఆయన అడిగాడు.

"ఆఁ అలానే గడిచిపోతున్నాయ్ రోజులు. మీ స్థితి ఎలా వుంది?—"

"ఏమంత చెప్పదగిన సంగతులు లేవులెండి. ఐనా - నాకు వొంటినిండా దురదలు ప్రారంభమైనయ్. చూడండి.

చూసాను. ఇంకా ఎక్కువగా దురదలు ముదరలేదు. ఔష ధం రాసిచ్చి "దీన్ని బాగా వొంటికి రుద్దుతూవుండండి; నయ మవుతుంది. నాకు కొంచెం పనుంది; చాలామంది రోగుల్ని చూడాలి. మీ రెక్కడ ఉగారు? భోజనం చేసారా! లేదా?—" అని అడిగాను.

మహేంద్రబాబు నవ్వి వూరుకున్నాడు.

"అయితే ఇక్కడే నాతోపాటు కలో, గంజో తాగండి. భజువా!—అరే—భజువా!"

నౌకరు పరుగెత్తుకొనివచ్చాడు. వాడికి అన్నిసంగతులూ చెప్పి 'చూడు బాబుగారికి బైట కుర్చీవెయ్; ఇంకా....అరే—వెల్తా వేమిటిరా? వంటాయనతో బాబుగారు ఇక్కడే భోజనం చేస్తారని చెప్పు—?"

నేను రోగులదగ్గరికి వెళ్లాను. ఎక్కడెక్కడో తిరిగాను. ఒకడికి పంటినొప్పి-మరొకడికి టి. బి., మరొహాడికి మలేరియా, సన్నిపాతం - ఈరోగాలకి అంతులేనట్లుగా వుంది. ఒకరికి ఏ రో గమూ వుండదు. కానీ, మానసికమైన బాధతో దుర్బలంగా కని పిస్తుంటాడు. ఒకాయన లావుగా వున్నాడు. కానీ, అన్నం జీర్ణం కావడంలేదని అతని అనుమానం! ఇంతకూ ఏది ఏమైనప్పటికీ నేను డాక్టర్ను గనుక అందరికీ ఏదో ఒకమందు రాసివ్వాలి! బీద వాళ్ళ సంగతెలావున్నా - గొప్పవాళ్ళకు అనేకరకాల జబ్బులతో పాటు, అనేకరకాల అనుమానాలు, జబ్బు రూపేణ వాళ్ళని పీడి స్తుంటాయి. ఏమీలేని పరిస్థితిలో వాళ్ళకు ఇంద్రియ దౌర్బల్యమన్నా ఇంద్రియ స్ఖలనమన్నా తప్పకండా వుండి వుంటుంది!

రోగుల్ని చూసి, తిరిగి తిరిగి ఇంటికి వచ్చేప్పటికి సగం పట్టణం నిద్రపోయింది. మహేంద్రుడు తిండి తిని ఎక్కడికో వెళ్ళాడని నౌకరు చెప్పాడు. నేనేదో యింత తిని - రసూల్‌పురం వెళ్లేందుకు సిద్ధమయాను. పైగా - జమీందారుగారి కారువచ్చి నా ఇంటిముందు ఆగిందికూడా!

బయల్దేరేముందు ఉన్నిదుప్పటి తీసుకవెళ్దామనుకుని, ఇంట్లోకి వెళ్ళి ఎంత వెదకినా కనిపించలేదు. భుజువా పెట్టెలూ, పరుపులూ, మంచమూ అన్నీ వెదకి విసిగిపోయాడు. కానీ,- దుప్పటి కనిపించలేదు. మాయమైపోయింది. యింతకూ యింట్లో ఒక ఆడమనిషి వున్నట్లయితే-అని ఆలోచించాను.

అనుకున్నానో లేదో-నా అంతర్భాగంలో నివసిస్తున్న 'ఆమె' ముఖం చాటు చేసుకుని నవ్వింది....

మోటారు బాణంలా దూసుకపోతూవుంది. ఇది ప్రగతి యుగం. అందులో వేగానికీ, యంత్రాలకి, సైన్సుకీ మరీను! జీవితమంతా బలంమీద ఆధారపడే రోజులుపోయినయ్. యంత్రాలమీదా, సైన్సుమీదా మానవుడు బతకడం నేర్చుకున్నాడు. మానవ విజ్ఞానం ఎంతగా మారిపోయింది!

నేను చూస్తున్న వాటినన్నిటినీ మోటారువేగంలోనే చూస్తున్నాను. కానీ,-ఏ ఒక్కటికూడా స్పష్టంగా వాటిరూపంలో కనపడడంలేదు. రోడ్డువెంట మోటారు పరుగుతీస్తూవుంది. క్షణకాలంలోని పరిచయంతో క్షణిక దర్శనం! పూలతోనిండిన చెట్టు దాటిపోయింది. కొంతమంది గొల్లవాళ్ళు తమ ఆవులకోసం వెనకబడిపోయారు. ఎవరో బాటసారి ఒంటరిగా వెళ్తున్నాడు. అదిగో వంతెన! అందంగల ఆడది నిలుచునివుంది. ఇంకొకచెట్టు

వచ్చింది. రెండుకుక్కలు మెల్లగా ఒకదానివెంట ఒకటి పోతున్నయ్. పక్కనించి ఇంకొక కారు సర్రుమంటూ, ధూళిలేపుతూ వెళ్ళిపోయింది. ఒకచెరువు! స్వచ్ఛమైననీరు. అదిగో ఒంటెద్దు బండిపోతూవుంది. తలమీది మూటలతో ఒకముసలిదీ, ముసలివాడూ పోతున్నారు. ఆ ముసలిదాని శరీరం కండలు తిరిగివుంది. కొన్ని కోళ్ళు మోటారు ముందుకు వచ్చినయ్! అరే, ఆపు-ఆపవోయ్! కారు ఆగనేలేదు. అన్నీ బ్రతికినవ్!

సాయంకాల మవుతుండగా కారు రసూల్‌పురం చేరింది.

రసూల్‌పురం జమీందార్ చనిపోయాడు. రెండేళ్ళయింది. సంతానంలేని విధవ జమీందారిణి మాత్రం నవయవ్వనంతో ఏకాకిగా ఈ సంపదకంతకూ ఉత్తరాధికారిణియై కూచుంది.

జమీందారుగారి కొత్తగుమాస్తా 'కుంజలాల్' నాకు ఎదురుగావొచ్చి స్వాగతమిచ్చాడు. ప్రస్తుతం జమీందారంతా ఈయనగారి అజమాయిషిక్రిందేవుంది; తెలివితేటలవల్ల, బుద్ధిచాతుర్యంవల్ల జమీందారుగారికి ఎక్కువ రాబడి కలిగించ గలిగాడు. మాటల్లోమాత్రం వినయానికి ఆయన పెట్టనికోట! మోటారునించి దిగానో లేదో, కుంజలాల్ వచ్చి నా పాదాలు ముట్టుకున్నాడు.

"అరెరే—" అంటూ నేను వెనక్కు జరిగాను.

కుంజలాల్ నవ్వుతూ "మీరు బ్రాహ్మణులు. మాకు పూజ్యులు" అన్నాడు.

రసూల్ పురం రావడాని కిదే నాకు తొలిసారి! కుంజలాల్‌ని నేనెరుగను? నే నాయనతో "జబ్బెవరికి?" అన్నాను.

"లోపలికి దయచేయండి. చాలా అలిసిపోయినట్లున్నారు.

కొంచెంసేపు విశ్రాంతి పుచ్చుకోండి. ఆతరవాత జబ్బుసంగతి మనం మాట్లాడుకుందాం!"

లోపలికి వెళ్లాను. నా కోసం చాలా అట్టహాసం చేసారు. ఒక నౌకరు నా కోసం కుర్చీవేసాడు. కాళ్ళూ, చేతులూ కడుక్కొనేందుకు నీళ్ళూ, సబ్బూ, తుండుగుడ్డ, 'టీ', ఫలహారమూ, ఆకులూ పొక్కా ...అన్నీ ఇంకో నౌకరు తయారుగా వుంచాడు. ఇవన్నీ చూసేప్పటికి నే నీ యింటికి అల్లుణ్ణనుకుని పొరపాటున చేస్తున్నారేమో ననుకున్నాను.

చివరికి కుంజలాల్‌తో "ఇక రోగిని చూద్దాం పదండి" అన్నాను.

"పదండి—పదండి" అన్నాడు కుంజలాల్.

"జబ్బెవరికి?—"

"రాణీగారికి"

జమీందారిణిని పరీక్షించాను. అయిదు నెలల గర్భిణని తేలింది. అంతా బాగానే వున్నారు. భయపడవలసినంత పనేమీ లేదు. మరి నన్నెందుకని పిలిచారో నాకేమీ తెలియలేదు. చాలాసేపు ఆలోచించిన తర్వాత నన్ను పిలిపించిన కారణమేమిటో బుర్రలో చటుక్కున మెరిసింది. రాణీగారు విధవకదూ?

"మీ రెంత కోరితే అంత——"

"క్షమించాలి"

"సరేలెండి. ఈ సంగతెవరికీ చెప్పకండా వుంటారని ఆశిస్తున్నాను."

"తప్పకుండా"

ఫీజుపుచ్చుకుని బైటికి వచ్చాను. మోటారు తయారుగా వుంది. నమస్కరించి, బండిలో కూర్చున్నాను. ఈసారి కుంజలాల్ పాదధూళి తీసుకోలేదు. బండి మహావేగంతో పోతూవుంది. మనసంతా చీకాకుగా వుంది. అనవసరంగా కాలాన్ని వృధాగా గడిపాను.

"బండిని ఆపవోయ్."

అన్నట్లుగానే ఆపాడు. మోటార్లోంచి దిగాను. "తిరిగి వచ్చేప్పుడు మీ ఇంటికి వస్తాను" అని పొద్దున గొల్లవాడికి చెప్పాను. ఇదే వాళ్ళవూరు!

కాలినడకన బయల్దేరానేగాని, మనసు నాలో లేదు. ఒక కుక్క నన్ను చూసి మొరిగింది. ఆ మొరుగుడు నన్ను మేలుకొలిపింది. గొల్లవాడి యిల్లెక్కడో అడిగి తెలుసుకున్నాను.

ఇంకా లోపలికి వెళ్ళనేలేదు. నా గుండెల్లో ఎవరో దెబ్బ కొట్టినట్లయింది. అంతా ఏడుస్తూవున్నారు. నేను రావడం తెలుసుకుని చనిపోయిన కుర్రవాడితల్లి గట్టిగా ఏడుస్తూ- "ఇప్పుడా రావడం బాబూ! మా నాయన వెళ్లిపోయాడు" అన్నది.

గుండెలు తరుక్కుపోయినయ్.

# 6

రాత్రి యింటికివచ్చి భోజనం చెయ్యలేకపోయాను. మనసెలానో వుంది.

"బాబుగారూ 'టీ' ఇవ్వమంటారా?" అని నౌకరు వినయంగా అడిగాడు. మంచంమీదకు వెళ్ళి పడుకుని "వద్దు—" అన్నాను.

నిద్రపట్టిన సంగతే నాకు తెలీదు.

మెలకువ రావడంతోనే లేచి చూసేప్పటికి చంద్రుడు అస్తమించబోతున్నాడు. క్షీణిస్తున్న వెలుతుర్లో సమస్త ధరాతలం తంద్రాతురతతో వుంది. కొన్ని గంటలు గడిచేప్పటికి ప్రపంచమంతా కోలాహల్వంతో నిండిపోతుంది! కానీ—నిర్జనమైన రాత్రిలోని ఆఖరి ఝామున మెదలకుండా పడుకుని నిద్రపోయే భూమివేపు చూసి, నా హృదయమంతా కరుణతో నిండిపోయింది. విడవని రోగంతో బాధపడుతున్నట్లుగా వసుంధరాదేవి నిద్రపోతూ వుంది. అభాగ్య భూదేవి తాలూకు విషాదమైన నవ్వులా మసక వెలుతురు కనిపిస్తూవుంది.

ఎదురుగా వున్న తోటలో తిరగాలని వెళ్లాను. పారుజాత వృక్షం నించి పూలు జలజల మంటూ రాలుతూవున్నయ్; భూమి మీదున్న గడ్డి—మంచుతో తడిసి పోయింది. నిశ్శబ్దమైన ప్రదేశంలో ఈ రాత్రంతా కూచుని ఎవరేడ్చారు? ఎవరు ... .. ..?

# 7

ఆ మాటలు నాకు బావుండకపోయినా వింటూన్నాను.

"మీరు నన్నెరుగరు కానీ—నళిని బాబు మాకు బాగా తెలుసు! ఆయన నాకు బావమరిది!—అంటే మేనత్త కొడుకన్న

మాట. పైగా 'పూర్ణియా జిల్లా' లోని జడ్జీలంతా నాకు బంధువులే! ఈవూళ్ళోని మిల్లు మానేజరు సర్వేశ్వరబాబు మా చిన్నాయన చెల్లెలికి మామగారవుతారు. ఒకసారి నేను మీ వూరిక్కూడా వచ్చాను. పందొమ్మిదిసందల పన్నెండునాటిమాట! అప్పుడు మీరు చాల చిన్నవారు. 'బ్రహ్మపురం'లో ప్రఖ్యాతి చెందిన డాక్టరు మా చిన్నాయన తమ్ముడికి బావమరిది. ఇంకా ఎంతోమంది నాకు తెలుసు. ఇక్కడి కమీషనర్‌గారి దగ్గరున్న 'కాశీశంకర్' బాబున్నాడే–ఆయన్ని నేను పెదనాన్నగారని పిలుస్తుంటాను. 'హరిహరపురం' ఇనస్పెక్టరు మీకు తెలుసనుకుంటాను; ఆయన మా మామగారికి మామగారవుతారు. మీవీధిలోని జీవనబాబు...."

విసుక్కుంటూ "ఇంతకీ మీకు కావల్సిందేమిటి?" అన్నాను.

"ఆ....ఆ....చిన్న అవుసరం వచ్చింది. డాక్టరు ఖగేంద్రుడు సామాన్య గృహస్తు లెవరూ ఇవ్వలేనంత డబ్బడిగాడు. మీరు చాలా దయామయులని........"

"మీ పనేమిటో చెప్పండి—"

"ఒక సర్టిఫికెట్టు కావాలి. ఖగేంద్రుడు మా మేనత్త చెల్లెలి కొడుకు! ఈ ఆసరాతో ఆయనదగ్గరకు వెళ్లాను. కానీ, బుద్ధి వచ్చింది ఏం చెప్పను? పదహారురూపాయ లడిగాడు. పదహారురూపాయలకుగాని ఆయన 'సర్టిఫికెట్' యివ్వడట!— చూడండి, ఆయన డాక్టరా లేక దోపిడి మనిషా–?"

అంతా విని "క్షమించాలి. అబద్ధపు సర్టిఫికెట్ మాత్రం ఇవ్వలేను." అన్నాను.

"అబద్ధమా? అబద్ధమెలా అవుతుంది? నేను మీతో చెప్పే దంతా అబద్ధమనుకుంటున్నారా?"

"అబద్ధమనికాదు, నిజమైతే కావొచ్చు కాని, మీ మాటల్ని విని నేను 'సర్టిఫికెట్ ఇవ్వలేను.

అతను కొంచెంసేపు మెదలకుండా వూరుకున్నాడు. దిట్ట మైన అతని కనుబొమ్మలూ, చెవులమీది వెంట్రుకలూ నిక్క పొడుచుకుని వున్నయ్. ముక్కులోంచికూడా కొన్ని వెంట్రుకలు బైటికి వచ్చినట్లున్నాయ్ గుండెమీదా, వీపుమీదకూడా వెంట్రు కలు వున్నాయనుకున్నాను. తలమీద టోపీవుంది. గడ్డం. మీసాలు గొరిగించుకున్నాడు.

క్షణంసేపు ఆయన నవ్వి "ఇటువంటి ఆపదసమయంలో మీరు నాకు సహాయం చేయకుంటే—ఇంకెవరు సహాయంచేస్తారు?" అన్నాడు.

"ఏంచేయమంటారో మీరే చెప్పండి, అసమర్థుణ్ని!"

"సరే మీకు ఫీజుయిస్తానులెండి; నా కేదో ఒకటి మీరే చేసిపెట్టాలి. గుమాస్తాపని చేసుకుంటూ ఎలానో కాలంగడుపు కుంటున్నాను .."

"క్షమించాలి. నేను సర్టిఫికెట్ ఇవ్వలేను."

"పోనీండి. మీరడిగినంత డబ్బిస్తాను. ఎంత ఇవ్వమం టారో చెప్పండి?"

"డబ్బుసంగతి కాదు. నేనిటువంటి సర్టిఫికెట్లు రాయను."

"అయితే మీకేం కావాలి? నా గుమాస్తాగిరిపోయినా ఫర్వా లేదన్నమాట."

"మీ అభిప్రాయం నా కర్థం కాలేదు!"

"నేను మాకంపెనీకి ఒక అర్జీని పంపుకున్నాను. ఇక్కడికి వచ్చిం తర్వాత నేను జబ్బులో పడ్డాను. ఒక నెలరోజుల పాటు శలవుకావాలని రాసాను. అక్కణ్నించి 'అటువంటప్పుడు ఒక మెడికల్ సర్టిఫికెట్ పంపించు' అని జవాబువచ్చింది. నేను సర్టిఫికెట్ పంపించకపోతే—నా గుమాస్తా నౌకరీ వూడిపోతుంది. ఇప్పుడు నేనేం చెయ్యాలో మీరే చెప్పండి. ఈ వూళ్ళో డాక్టర్లు ఇద్దరే వున్నారు. ఒకరు మీరూ, రెండోది ఖగేంద్రుడుగారు! ఖగేంద్రుడు నాకు అందేట్లు లేడు; మీరేమో వివేకమనీ, నీతని కొన్ని నియమాలు పాటిస్తారు. పెద్ద ఇబ్బందిలో పడిపోయాను. అని ఆయన నావేపు చూసాడు.

భజువావచ్చి "తమకోసం ఇద్దరు మనుష్యులువచ్చి బైట కూర్చున్నారు." అని చెప్పాడు.

"నా విషయం ఇంకొకసారి ఆలోచించండి" అని అత నన్నాడు,

"క్షమించాలి."

ఒక నిట్టూర్పు విడిచి, ఆయనలేచి కొంచెందూరం వెళ్ళి తిరిగివచ్చి "—నేను జబ్బుమనిషిని కానని మీరనుకోకండి; నేను నిజంగా జబ్బుతో వున్నాను! ఆకారణంతోనే గుమాస్తాపనికి శలవు పెట్టాను. ఐనా ఇంగ్లీషుమందులు నేనెప్పుడూ తినలేదు. నా దగ్గర హోమియోపతి పెట్టెవుంది. నాకు నేనే చికిత్స చేసుకుంటాను. అటువంటప్పుడు 'సర్టిఫికెట్' నాకు నేనే రాసుకుంటే ఏమవుతుంది? చెప్పండి. ఖగేంద్రుని దగ్గరికే వెళ్ళమంటారా? ఆ మనిషి మహాలోభి. పని గడుపుతాడుగాని, రెట్టింపు లాగుతాడు. అదే నాకు కష్టం" అన్నాడు.

హఠాత్తుగా నా చూపులు అతని శాలువామీద పడినయ్. అది నా శాలువా లానే వుంది. చూస్తూ వుండిపోయాను.

నా చూపుల్నిబట్టి అతను "ఏమిటిలా చూస్తున్నారు డాక్టరు గారూ? వులన్ శాలువానా? శాలువ మూలకంగానే డబ్బు సిన్ననే ఖర్చయింది. లేకపోతే ఖగేంద్రుడితోనే సర్టిఫికెట్ రాయించేవాణ్ని. పన్నెండురూపాయలకు చాలా చవకగానే దొరికిందిలెండి, అరవై రూపాయలకు తక్కువవుండదు . ."

"కాదు డెబ్బై అయిదు——"

"అంత ఖరీదు చేస్తుంది...."

"అయితే మీరు దీన్ని ఎక్కడకొన్నారు?

"ఆ నల్లమందుబాబు మహేంద్రుడు మీకు తెలుసుగదండీ, అతనిదగ్గరే కొన్నాను. ఆయన నా దగ్గరకువచ్చి "చాలా ఇబ్బందిలో వున్నాను. ఈ శాలువా వుంచుకొని పన్నెండు రూపాయలు ఇవ్వు" అని అన్నాడు. నాకూ ఆశకలిగింది; కొన్నాను. అయితే యిందులో ఏమన్నా మోసముందా ఏమిటండీ?"

"లేదు. లేదు."

వులన్ శాలువా కప్పుకొని అతను వెళ్ళిపోయాడు చలిలో వణుకుతూ నే నుండిపోయాను. పోలీసుస్టేషనుకి రిపోర్టు చేద్దామని నాకు లేదు.

నా మనసులో ఎవరో పోలీసుస్టేషనుకు కబురు చేయకుండా వుండడం న్యాయాన్ని అతిక్రమించినంత తప్పు. న్యాయానికి విరుద్ధంగా నువు ఒకప్రక్క ప్రవర్తిస్తూనే వున్నావ్! అటువంటప్పుడు ఆమనిషికి ఒక సర్టిఫికెట్టు ఇవ్వలేవూ? ఆలోచించు, అతనెంతో సంతోషిస్తాడు. నీకూ కొంత డబ్బు గిట్టుబాటవుతుంది.

నిజానికి అతను జబ్బుతోనే బాధపడుతున్నాడు. ఈ ఇంగ్లీషు మందులు అతనికి పడవేమో!—" అన్నాడు.

భజువావచ్చి "మీ కోసం బైట ఇద్దరు కూచుని వున్నారండి'' అన్నాడు.

# 8

బైటకు రావడంతోనే మొట్టమొదట కాబూలీతో మాట్లాడడం తటస్థపడింది. అతను సలాంచేసి తనకు 'సిఫిలిస్' (వేడి) జబ్బుని ఏ మేమో చెప్పి నాదగ్గర మందు తినేందుకు వచ్చాననీ చెప్పాడు. అతనికి చీటి రాసిచ్చి పంపాను.

ఆ తరవాత ఒక బెంగాలీ మహాశయుడు ముందుకు వచ్చి "తమతో కొంచెం రహస్యంగా మాట్లాడాలి." అన్నాడు.

"సరే—"

ఆయన రహస్యమంతా చెప్పి "మీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు.

"మీకు సిఫలిస్ తగిలిందనుకుంటాను,"

"ఎలా తగిలిందంటారు?"

"అది మీకే తెలియాలి."

ఆ తరవాత కొంచెంసేపు ఆలోచించి మీకు ఇతరత్రా ఏమన్నా సాంగత్య ముందా?—" అని అడిగాను.

ఆయన నాలుక కరుచుకొని "నారాయణ.....నారాయణ" అని అన్నాడు.

"అటువంటప్పుడు మీ రక్తాన్ని పరీక్షించుకోండి."

"సరేలెండి!....ఐతే, అంగవస్త్రాలు కట్టుకున్నా, గోచి పాతలు పెట్టుకున్నా ఈ జబ్బు వస్తుందాండి?"

"ఎందుకు రాకూడదు?"

"మరి—నన్నేం చేయమంటారు?"

"రక్తం పరీక్ష చేయించండి. అంతవరకు నేనొక ఔషధాన్ని రాసిస్తాను. దాన్ని తింటూ వుండండి."

చరిత్రకు ప్రసిద్ధి పొందిన ఆ బెంగాళీ మహాశయుడు శలవు తీసుకొని వెళ్తూ "మీఫీజును మా గుమస్తాతో పంపిస్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఒక మార్వాడీ శేటు వచ్చాడు. చికిత్సపేరుతో చాలాకాలం ఈ రకాన్ని పిండవచ్చు. కానీ,—నాకేం దుర్బుద్ధి పుట్టిందో సాధారణమైన మందును రాసిచ్చి పంపించాను.

ఆ వీధిలోని హారాన్ బాబు హఠాత్తుగా వూడిపడినట్లు లోనికి వస్తూనే "డాక్టరుగారూ! కొంచెం ఏదైనా ఏర్పాటు చేయండయ్యా! నేనిక సహించలేకపోతున్నాను. నా పరిస్థితి భయంకరంగా మారుతూవుంది" అన్నాడు.

"ఏం జరిగింది?—"

"నిన్న రాత్రి నాభార్యారత్నం ఇంకొక కన్యారత్నాన్ని ప్రసవించింది. దీంతో ఇప్పటికి అయిదు! ఏదైనా ఉపాయం చూడండి బాబూ! మీరేమీ ఆలోచించకపోతే నేను రసాతలానికి వెళ్ళాల్సిందే! ప్రస్తుతం గర్భనిరోధకాలు చాలామంది డాక్టర్లు వాడుతున్నారు. అటువంటి మందును మీరుకూడా నాకు రాసిచ్చి పుణ్యం కట్టుకోండి."

"అంత గ్యారంటీగా యిచ్చే మందేమీ లేదు."

"మీరు నన్నొక మూర్ఖుడికింద జమ కడుతున్నారన్న మాట?"

"మూర్ఖుడవెందుకవుతావ్? ముప్ఫైరూపాయలు సంపాయించే వాడి కిచ్చి, పెండ్లిచేసి విశ్రాంతి పుచ్చుకోవయ్యా."

"చేసుకునేవాళ్లు దొరకవద్దండి."

"అటువంటప్పుడు పిల్లలు పుట్టడంతోనే ఎవరికన్నా ఇవ్వండి, లేదా—పారవేయండి."

"అంటే—"

"అంటే ఏముంది. పారవేయడమే!"

"బాగానేవుంది. ప్రపంచంలోంచి మానవజాతే నాశనమైపోవాలని మీరనుకుంటున్నారన్నమాట?"

"పోనీయండి. ఇందువల్ల కలిగే నష్టమేమీ లేదు. ఇంతకన్నా దేశంలో అడుక్కుతినేవాళ్ళ సంఖ్య కొద్దిలో కొద్దిగా నన్నా తగ్గుతుంది. ప్రజలకి క్షామం వస్తుందని భయంగాని, దేశంలో ఆహారం చాలదనే ప్రశ్నగాని వుండదు."

హారాన్ నవ్వి "అందుకనే మీరింతవరకూ వివాహం చేసుకోకండావున్నారన్నమాట!—అవున్లే, మీపని చాలా జోరుగా సాగుతూవుంది. కుప్పకుప్పలుగా సంపాయిస్తున్నారు. ఎలాగున్నా మాట్లాడినా చెల్లుబడవుతుంది........ఇక ఈ సంవత్సరమన్నా పెండ్లి చేసుకోండి. మీకు పుట్టే పిల్లాడు అడుక్కు తినవలసిన గతి వుండదు." అన్నాడు.

ఆతని మనసుకు నొప్పి తగిలినట్లు గ్రహించి "మనందరి పరిస్థితీ ఒక్కటేనోయ్—"అన్నాను.

"డాక్టరుగారూ, ఇవాళ మీ రక్తం మహా ఆవేశంతో పొంగుతూవుంది. ఏదైనా అంటారు. భవిష్యత్‌ని గురించి మీరు ఆలోచించడం లేదు. దూరంగా ఆలోచించండి. 'సంతానంలేని మనిషి జీవితం ఇసుక ఎడారివంటి'దని తెలుసుకునే రోజు నీకు రాకపోదు."

పోస్టువాడు వచ్చి ఉత్తరాలు ఇచ్చి వెళ్ళాడు ఉత్తరం పుచ్చుకుని చూసాను. "శుభవివాహం" ఎర్రని కవరుమీద బంగారు అక్షరాలు కనిపించినయ్.

వివాహం చేసుకుంటూవుంది. ఎవరు?—నన్నాహ్వానించే దెవరు?

ఉత్తరం విప్పి చూసాను.

''శ్రీమాన్ జయరాం దాసుగారి పుత్రుడు 'శ్రీ గోపాల్ దాసుకు శ్రీ హరిదాసుగారి సుపుత్రి 'చంచలాదేవి' నిచ్చి, శుభ వివాహం జరపడానికి సుముహూర్తం నిశ్చయమైంది. ఈవివాహ మహోత్సవానికి తమరు సకుటుంబ పరివారంగా విచ్చేయాలని ప్రార్థన.''

ఈ గోపాల్ దాసెవరు?—

కవరు విప్పి చూసాను. అందులో ఇంకొక ఉత్తరం వుంది.

''డాక్టరుగారూ! నన్ను మీరు మరిచిపోలేదనుకుంటాను. నేను, నా భార్యను చికిత్స కోసం మీదగ్గరికి తీసుక వచ్చాను. నా భార్య ఎవరంటారా? ''నందగోపాలా, నందకిశోరా!'' అని పాట పాడుతూ పిచ్చిదైపోయింది. మీ కిప్పుడు జ్ఞాపకం వచ్చిందనుకుంటాను. నెలరోజుల క్రితం ఆమె ఆత్మహత్య చేసుకుంది.

నేను రెండో పెళ్ళి చేసుకుంటున్నాను. ఆశీర్వాదాలు ఇవ్వండి. వీలుంటే మీరుకూడా దయచేయండి.'' అని వుంది.

అయితే ఆ సంతానహీనురాలు ఆత్మహత్య చేసుకుందా? పీడ వొదిలింది. లోపలికి వెళ్దామని లేచాను.

''మీరు వెళుతున్నారా?'' అని హారాన్ అడిగాడు.

''నా కధికారం వుంటే ఏం చేస్తానో తెలుసా?''

"ఏంచేస్తావు?"

"అందర్నీ తుపాకీ గుండుకు ఎరచేస్తాను. నిలుచోపెట్టి కాల్చి చంపేస్తాను." అని లోపలికి వెళ్ళిపోయాను.

నా మనసేమీ బావుండలేదు. ఎన్నెన్నో ఆలోచనలు తిరిగినయ్. ఆఖరికి చంచల తండ్రి హరిదాసుపేర గోపాలదాసుకు ఆయన కూతుర్నిచ్చి పెళ్ళిచేయవద్దనీ, అతనికి మహాభయంకరమైన గనేరియా రోగం వుందనీ, టెలిగ్రాం ఇద్దామనుకున్నాను.

కానీ,-ఏమీ చేయలేకపోయాను. నా ఉలన్ శాలువాని గురించి పోలీసులకు రిపోర్టు చేయనట్లుగనే ఆఖరికి ఆయనకి ఉత్తరంకూడా రాయలేకపోయాను.

నా వివేకంమీదా, నా నైతికంమీదా నా కెంతో గర్వం వుంది.

# 9

'సర్—ర్రు' మంటూ ఓ కారువచ్చి ఇంటిముందు ఆగింది.

అరే!-ఇది రసూల్‌పురం కారేనే! అప్పటి డ్రైవరే అతను!

కారులోంచి దిగుతూ 'సలాం' చేసి అతను నాకు ఉత్తరం ఇచ్చాడు.

కవరు చించి చదివాను. "....ప్రమాదమైన స్థితిలోవుంది. పరిస్థితులేమీ బావుండలేదు. ముఖ్యంగా మీరు రావడం చాలా అవసరం. ఈ ఉత్తరం అందడంతోనే బయలుదేరి రండి—కుంజలాల్"

అక్కడికి వెళ్ళడంతోనే తెలిసిన సంగతులేమిటంటే—నేను నీతికీ, గౌరవానికీ సిద్ధాంతరీత్యా చేయని పనిని, సాధారణమైన ఒక నర్సు చేసిందట; కానీ,—దాని ప్రతిఫలం మాత్రం చెప్పేందుకు వీలులేని విధంగా మారింది. రాణీగారు మృత్యుముఖంలో వున్నారు.

"మీ రీమెను ఏవిధంగానన్నా బ్రతికించాలి డాక్టరుగారూ" అని కుంజలాల్ వినయంగా ప్రాధేయపడ్డాడు.

రాణీగారిప్పుడు ఒక రోగి! నా నీతికి బాధేమీ వుండదు. రోగిని బ్రతికించడం ప్రతి డాక్టరుకీ పరమధర్మం!

"సరే. యథాశక్తితో పనిచేస్తాను! కొన్నిమందులు రాసిస్తాను. ఈ మందుల్ని పట్టణంనించి వెంటనే తెప్పించండి"

"ఇప్పుడే"

"ఆఁ—"

కారు పట్టణం వేపుగా బయల్దేరింది ...!

కొత్త ఉపద్రవమేమీలేకుండానే రాణీగారి ప్రాణాలు రక్షించబడినయ్! నా కున్న విద్యా నైపుణ్యమూ సార్థకమైనయ్. కానీ, ఈ కేసును మొదట్నుంచీ నా చేతుల్లోకి ఎందుకని తీసుకోలేదు? ఆపసిగుడ్డు బ్రతకలేదు. సమాజానికి పనికిరాని దాన్నెవరు రక్షిస్తారు?

మొదట్నుంచీ ఆమెకు నేను మందు ఇస్తున్నట్లయితే—ఈమె కీ స్థితి వచ్చేదేకాదు. శిశువు పోవడమేగాక, తల్లికూడా ఎగిరిపోయేదే! ఏమేమిటో అనవసరమైన ఆలోచనలు.

ఇంటికి తిరిగి వస్తూన్నపుడు మా డాక్టర్ల పనెందు కింత ఆశ్చర్యకరంగా మారుతుంటుందా? అని ఆలోచించాను. తెలిసి తెలీని సగంజ్ఞానపు బరువును తలపైపెట్టుకొని, మేమీ రోగులసంత చుట్టూ తిరుగుతూ వుంటాము. పైగా, దేన్ని వివేకమూ, సిద్ధాంతమూ అని అనుకుంటామో—అదంతా ఒక మోసమని తెలుసుకోలేము. ఎందుకంటే—ఒకరకమైన వివేకాన్ని, సిద్ధాంతాన్ని, ప్రజల మీద ప్రయోగించేందుకు తయారవుతూ వుంటారు. ఏది పరిపూర్ణమైన యుక్తి సంగతమో, దానికీ సిద్ధాంతానికీ ఏ విధమైన సమన్వయముండదని తెలుసుకోలేరు. ఏది 'అన్యాయమో దాన్ని సిద్ధాంతముతో ముడిపెట్టి ప్రజలమీద రుద్దేందుకు ప్రయత్నిస్తారు. వివేకానికి అర్ధయుక్తి సంబంధమైన బుద్ధితో తారుమారు చేయడంకన్నా—సమాజికమైన బుద్ధిని ఉపయోగించడం మంచిదని తెలుసుకోవడం మంచిది! మానవజాతి మొట్టమొదట్నుంచీ, అర్ధయుక్తి సంబంధమైన బుద్ధిని ప్రయోగించి స్త్రీ జాతిని చనిపోయిన భర్తశవాలతో అగ్నిలో దుమికించారు. గంగానదిలో తమ సంతానాన్ని తోయించారు. పసికుద్దుల్ని పెట్టిలోపెట్టి గంగానదికి అర్పించారు. ఈనాడుకూడా అటువంటి వివేకంతోనే నరబలిని యిస్తున్నారు; విధవల్ని ఉపవాసముంచి, శరీరాన్ని శుష్కింపజేయడమేకాక, జబ్బుతో బాధపడుతున్నప్పుడు కూడా మందు మాకును ఇప్పించేందుకు ప్రయత్నింపజేయడంలేదు. ఎప్పుడూ భగవంతుని

సేవజేయమంటుంటారు. ఇటువంటి వివేకమే మా డాక్టర్లనుకూడా పశువులుగా మార్చింది.

ఐనా మేమేం చేయగలుగుతాం? నిజానికి మా సమర్థత ఎంత? ఏరోగిమీద మాశక్తి నంతటినీ ఉపయోగించి మందు మీద మందు మారుస్తూ, మలమూత్ర రక్తాదులు పరీక్షించినా— ఆ రోగితాలూకు రోగచిహ్నమేమీ బయటపడకపోవచ్చు.—కర్మం కాలి జబ్బుతాలూకు రోగం నిర్ధారణమైనప్పుడు, ఆ జబ్బును నయం చేయలేకపోవచ్చు! అప్పుడప్పుడు రోగం తెలియక పోయినా—జబ్బు నయంకావచ్చు!

ఇందువల్ల మేమంతా—నిస్సహాయులమని రుజువు అవుతూ వుంది. అటు రోగి "డాక్టరుగారు నాప్రాణాల్ని జేబులో పెట్టుకుని తిరుగుతూ వున్నాడు" అని అనుకుంటాడు.

ఇంటికి వచ్చేప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది. మోటారుదిగి గుమ్మంలో కాలుపెట్టేప్పటికి ఒకామె ముందుకు వచ్చి నమస్కరించింది.

ఆశ్చర్యంతో "ఎవరూ?—"అన్నాను.

తలవొంచుకుని "నేను ఆస్మానీనండి" అన్నది.

"ఏం కావాలి?"

"ఏమీవొద్దు. తమ దర్శనం కోసం వచ్చాను.

"లోపలికి రాండి"

ఆమె నా వెంటే లోపలికివచ్చింది. ఆమెను గుర్తుపట్ట లేకపోయి చివరికి మిమ్మల్ని గుర్తుపట్టలేకపోతున్నాను అన్నాను.

"మీరు నన్ను గుర్తుపట్టనేలేదా? రెండునెలలక్రింద ఒక సాయంకాలం మీ వగ్గరికివచ్చాను. నా వొంటినిండా మచ్చ

లున్నయ్! ఒకరూపాయిస్తూ, మీరు నా కొక చీటీ రాసిచ్చారు. గుర్తుకు వచ్చిందనుకుంటాను....? ఆ మందుతోనే నా జబ్బంతా పోయింది. భగవంతుడు మీకు నూరేళ్లాయువివ్వాలి. ఇప్పుడింకా న న్నామందును తినమంటారా; వద్దంటారా?"

నా కాశ్చర్యం కలిగింది. నేనా చీటీ ముక్కను ఆలోచించకుండానే రాసిచ్చాను. దానికిజరిగిన ప్రతిక్రియను చూసేప్పటికి నా నోటినించి మాట పెగిలి రాలేకపోయింది. మాటలకూడా అందని ఇంత అపురూపమూ, విస్మయమైన ఇంత సౌందర్యమూ ఆరోగం లోపల దాక్కుని వుండడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"సరే! ఇంకొక సీసాని కొనుక్కుని ఆమాత్రల్ని తిను. నీదగ్గర డబ్బుందికదూ!....నువ్వెక్కడుంటున్నావ్?"

"రంగబజారులో వుంటున్నానండీ! నా దగ్గరిప్పుడు డబ్బుంది. కొనుక్కొని తింటాను."

ఆమె వేశ్యా వృత్తితో బతుకుతుందని స్పష్టమైంది. ఇప్పుడామెకు యవ్వనం, రూపం—సౌందర్యం అన్నీ వున్నాయి. జీవితంలో బాధపడవలసిన పని లేదు.

ఆస్మానీ వెళ్లిపోయింది.

నేను నా వివేకాన్ని వ్యంగ్యంగా "ఈ పని మంచిదేనా? మానవరూపంతో కూడుకున్న అగ్నిజ్వాలని సమాజపు మధ్యలో వొదిలిపెట్టి, మంచి సత్కార్యమే చేసావుకదూ? ఆరిపోయేందుకు సిద్ధమైన అగ్నిశిఖకు ప్రాణంపోసి బ్రహ్మాండమైన అగ్నికణాన్ని సమాజంమీదకు వొదిలివేసావు. మంచిపనే చేసావుకదూ?" అని అడిగాను.

ఎక్కణ్ణుంచో హారాన్ వచ్చాడు. ఆయన కూర్చుంటూనే "హరీష్‌బాబుతో మీకు పోట్లాట వచ్చిందా ఏమిటి?" అని అడిగాడు.

"లేదే....ఏం—ఏంజరిగిందేమిటి?"

"ఆయన నీ విషయంలో చాలా చెడ్డగా ప్రచారం చేస్తున్నాడు. వాళ్ళబ్బాయి జబ్బులో వున్నప్పుడు, మెడవంచి దమ్మిడీలతో సహా డబ్బు గుంజుకున్నావట! డబ్బు ఇవ్వలేని స్థితి కతను వచ్చేప్పటికి బిడ్డను చూడ్డానికి వెళ్ళడమే మానివేసావట! వాళ్ళబ్బాయి నీచేతుల్లో ఇరుక్కుని సరైనచికిత్సలేక చనిపోయాడట!"

"హరీష్‌బాబు ఇలా అంటున్నాడా?"

"అవునుబాబూ, అవును! ఒకనాడు ఖగేంద్రుడి దగ్గర కూర్చుని 'ఒకటో నెంబరు మోసగాడని, డాక్టరుపేరుతో ప్రజల ప్రాణాన్ని తీసే యముడనీ, దగాకోరనీ, ఏమేమో వాగుతున్నాడు"

నేను నవ్వి వూరుకున్నాను.

హారాన్ మాత్రం ఆగకుండా "—నీ నడవడిక ప్రస్తుతం బావుండడంలేదట. చరిత్రలేని మనిషిలా ప్రవర్తిస్తున్నావట. మర్యాదస్తుల ఇండ్లకు నిన్నుపిలవడం మంచిదికాదట! ."అనిఅన్నాడు.

"ఐతే నా చరిత్ర మంచిదికాదనేందుకు నేనేంచేసాను?"

"రంగబజారులోని ఎవరో వేశ్య ప్రతిరోజూ సాయంకాలంపూట నీదగ్గరకు వస్తూండడం హరీష్‌బాబు తన కళ్ళతో చూసాట్ట! వయసులోవున్న మంచి ఆడదాన్ని దాసీ మనిషిగా నువు కుదుర్చుకున్నావట!-అంతకుముందు నీదగ్గర మగవాడొకడు దాసీపని చేసేవాడట. నిజమేనా?"

"అవును. ఈ దాసీ మనిషి అతని పెళ్లాం! వాడేదో పని మీద వూరికి వెళ్తూ శలవు పుచ్చుకుని—పెళ్లాన్ని తన పనికి పురమాయించాడు. నేనామెను కుదుర్చుకోలేదే."

"మరి—నీకు వంటెవరు చేస్తున్నారు?"

"ఇప్పుడదే వంట చేస్తూవుంది."

"మీరు చెప్పేది నిజమేనా ఏమిటి? ఆమె చేతి కూడు నీకు సహిస్తుందా?"

"ఆమె భర్తచేతికూడు సహించినప్పుడు, ఆమె చేతికూడులో దోషమేముంది?"

కొంచెంసేపు హారాన్ మెదలకుండా వూరుకుని "డాక్టరు గారూ, మీరు చెప్పే కారణం బావుండలేదు. మగవాడు చాలా దుర్బల మనఃప్రవృత్తిగలవాడు. మనసు మారడానికి ఎంతకాలం కావాలి?" అని అన్నాడు.

"మారుతూనేవుంది!"

"ఏమిటంటారు?—"

"మారుతూనే వుంటుందంటాను. మీరేమీ గాబరా పడాల్సిన పనేమీ లేదు. నిజమే! ఈ క్షణంలో నా మనసు మారుతూ వుంది. మారిపోయి ఏంచేయాలనుకుంటుందో తెలుసునా?— నీ మొహంమీద గట్టిగా గుద్దాలనిపిస్తుంది. ఐనా—నేను బలవంతంగా ఆపుకుంటున్నాను. ఈవిధంగానే నే నెన్నోసార్లు ఆపుకుంటున్నాను. తెలిసిందా?—

"నీ మనసులో అప్పుడప్పుడు నా మొహంమీద గుద్దాలనిపిస్తుంటుందా? నేనేం తప్పుచేసాను?

"ఈ శుభసందేశాన్ని నాతో చెప్పేంత అవసరం నీ కెందుక్కల్గింది? అక్కడి సంగతులు ఇక్కడ చెప్పలేకుండా వుండ లేవా? పనికిమాలిన విషయాలు చెబుతూ నా టైమును అనవ సరంగా పాడుచేయడానికి నేను నీకేం అపకారం చేసాను? పిలవక పోయినా మీ ఇంటికి వచ్చి మందూ మాకూ డబ్బులేకుండా ఇస్తు న్నందుకా? నీతో స్నేహం చేస్తున్నందుకేనా?"

"నువ్విలా కోప్పడతావనుకోలేదు. నీ మీద నా కెంతో ప్రేమా, గౌరవం వున్నాయి గనుక చెప్పాను. లేకపోతే-నాకేంపని?"

"అయితే ఇక శలవిప్పించండి" అని లోపలిగదిలోకి వెళ్ళిపోయాను.

ఇల్లంతా నిర్మానుషంగావుంది. పక్క చిందర వందరగా పడుంది. తలగడదిండ్లవద్ద ఒక పుస్తకం సగం తెరిచుంది! గాలికి పేజీలు రెపరెపమని కొట్టుకుంటున్నాయ్. కిందున్న పళ్ళెంలో టీ, గ్లాసు దొర్లిపోయుంది. గ్లాసులోని టీ.ని-ప్రొద్దున్నే త్రాగి గదికి తాళంవేసి రసూల్‌పురం వెళ్లాను. పనిమనిషిదేమీ తప్పులేదు. ఎదురుగా స్వామీ వివేకానందుని పటంమీద ఒక బల్లి తన తోకను ఆడిస్తూవుంది. మహాత్మాగాంధి పటంమీదకూడా ఒక బల్లి కూచుని వుంది. అదికూడా తోక ఆడిస్తూవుంది.

ఆ పుస్తకం తీసుకుని మడత కుర్చీలో కూర్చున్నాను. పుస్తకం విప్పేప్పటికి ఓ పదిరూపాయలకాగితం వొడిలోపడింది. అందులో పెట్టి ఎప్పుడు మరిచిపోయానో ఏమో! పుస్తకం మీదకు మనసు పోవడంలేదు. ఆకాశంమీద చంద్రుడు మేఘా లతో దాగుడు మూతలాడుకుంటున్నాడు . .

"డాక్టరుగారూ?"

"ఎవరూ?— లోపలికిరాండి!"

అరే! హరీశ్‌బాబే!—

"ఎందుకో వచ్చారు?"

"మా ఇంటికి మీరు ఒకసారి రావాలండి. మా ఆడాళ్లు కడుపునొప్పితో బాధపడుతున్నారు"

హారాన్ చెప్పినమాటలు గుర్తుకు వచ్చినయ్; మీ ఇంటికి రానని చెబుదామనుకున్నాను. కానీ, నా బుద్ధిమాత్రం "హరీశ్ బాబు భార్య నీకేమపకారం చేసింది?" అని సముదాయించింది. ఒక్కమాటకూడా మాట్లాడకండా బ్యాగ్ తీసుకొని హరీశ్‌బాబు వెంట వెళ్ళాను....

* * *

హరీశ్‌బాబు మాటలకు మనసొకప్రక్క బాధపడుతూ వుంది. దానికితోడు ఉదయమే ఒక పెద్దమనిషి నా నిద్రకు భంగంకలిగించాడు. బైటికివచ్చి చూసేప్పటికి పాతస్నేహితుడైన ఒక వకీలుగారు నిలుచునివున్నారు.

ఆయన నిలుచుని కళ్ళజోడు తుడుచుకుంటూ నన్నుచూసి "క్షమించాలి. మీ నిద్రకు భంగం కలిగించాను." అన్నాడు.

"లేదు లేదు. నా నిద్రకేమీ భంగం కలగలేదులెండి. కూర్చోండి. ఇంతకూ విశేషాలేమిటి?"

"డాక్టర్లు దగ్గరకు శుభసందేశాన్ని తీసికొని ఎవరన్నా వస్తారా? ఏదో కొంత పనుండబట్టే మీదగ్గరకు వచ్చాను. ఇంకో విధంగా అనుకోకండి. చిన్న విజ్ఞాపన ఒకటుంది—"

"అసలు సంగతేమిటో చెప్పండి."

వకీలుగారు జోడుతుడుచుకుని "పూల్‌బాగ్‌లో వుంటున్న నందగోపాలుడు మీకు తెలుసుననుకుంటాను. ఇప్పుడు వాడు జబ్బుతో వున్నాడు. పైగా చాలా ఇబ్బందిలోవున్నాడు. జబ్బు కూడా చాలా పెద్దదే! చిల్లర వైద్యాలు శక్తికొద్దీ చేయించు కుంటూనే వున్నాడు. కానీ, పరిస్థితేమీ బావుండలేదు. గాలిమార్పు కోసం ఇక్కడికి వచ్చాడు. వాడిబాధా ఆ పరిస్థితీ చూస్తే ఎవరి మనసన్నా కరిగిపోతుంది. ఆ కేసును మీరు తీసుకొని జాగ్ర త్తగా చూడాలని నా కోరిక...."

"ఫీజులేకండా ఎటువంటి వ్యాధిక్కూడా నేను మందివ్వను. క్షమించాలి. నా దగ్గర మందు తినాలనుంటే - డబ్బు ఇవ్వా ల్సొంటుంది" అని కోపంగా చెప్పాను.

"మంచిదే కాని అతను చాలా బీదవాడండీ...."

"నిజమే! అతడి బీదతనంమీద మీకు జాలిగావుంటే - ఆ ఫీజు మీరివ్వండి. మీరంత బీదవాళ్ళు కారుగా! దయ అనేది ఏమంత చెడ్డవస్తువు కాదు. మీ మనసులో దయకలిగింది. అందు కని నేను నష్టాన్ని అనుభవించాలా? మీ రిలా చెప్పడం బావుండ లేదు."

కళ్ళజోడు తుడుచుకుంటూ వకీలుగారు కోపంగా "డాక్టర్ల మనసును భగవంతుడు పాషాణంతో సృష్టిస్తాడో ఏమిటో,— అందరిలానే మీరుకూడా మాట్లాడారు. అందరూ మీ రెంతో దయగలవారని చెబుతుంటే విన్నాను. సరేలెండి. మీ కలానే మీ ఫీజు ముట్టచెబుతాను." అన్నాడు.

నేను నవ్వి నా మనసులోని కరుణతో, దయతో ఆర్థికంగా నష్టపడుతూ, రాత్రింబగళ్లు విసువూ విరామం లేకండా తిరుగుతూ

ఇప్పటికే ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నాను. ఇటువంటి పరిస్థితిలో ప్రపంచంలోని ప్రజల బరువు నా తలమీదికి తీసుకోలేను. ఆ సామర్థ్యం నాలో లేదు." అని అన్నాను.

"సరేలెండి. మీ రెప్పుడొస్తారు?"

"సాయంకాలం. షుమారు అయిదుగంటలకు వస్తాను."

"సరే వెళ్తానండి." అంటూ లేచాడు. ఆయన్ని నేను వారిస్తూ "కూర్చోండి. అప్పుడే వెళ్తారేమిటి? కొంచెం టీ త్రాగి వెళ్ళండి" అన్నాను.

వకీలుగారు కూర్చున్నారు.

"వకీలుగారూ; ప్రపంచాన్నింతకాలంనించీ చూసాక దయతలిచి, కరుణపుట్టి, ఎవరికీ ఉపకారం చేయకూడదనే దృఢ సంకల్పానికి వచ్చాను. ఎంతలేదన్నా ఈ హిందూదేశంలో మాత్రం అలాచేయలేను. యూరప్ విషయం నాకు తెలీదు. ఈ సిగరెట్టు ముట్టించండి.

సిగరెట్ ముట్టించి "దయతలచి ఎవరికీ ఉపకారం చేయ ననడంలో మీ ఉద్దేశం తెలుసుకోవచ్చా?'' అని అడిగాడు.

"ఏముంది, ఫీజులేకండా నేను మందు ఇవ్వడం మొదలు పెట్టానంటే, ఎవరూ నన్ను పిలవరు. ఎవరైనా ఒకవేళ పిలుస్తారనుకోండి,—నేను చెప్పినట్లు వాళ్ళెప్పటికీ చేయరు. ఆఖరికి నా మందుచీటీ కూడా ఎవరికీ అర్థంకాదు."

"కాదు....అది కాదులెండి—"

"అంతేనండి—అంతే! మీకు అబద్ధం చెప్పడంలేదు. నేను నాకళ్ళతో చూసిన సంగతినే మీకు చెబుతున్నాను. పదిరోజుల కింద జరిగిన సంగతి. ఒక మనిషిముఖం చూసి దయతో కరిగి

పోయి, దగ్గరికివెళ్ళి "నీకు జబ్బేమిటయ్యా?" అని అడిగాను. మూడునెలల్నుంచీ జ్వరం వదలడంలేదట పరీక్షచేసి చూశాను. గుండెజబ్బు; ప్లీహం—పొట్టక్రింద నీరుచూపడం మొదలైనవన్నీ వున్నాయ్ ఆ దీనుడు, దరిద్రుడు, అరోగిష్టిప్రాణి నిజంగా నాహృదయాన్ని దయాసముద్రంలో ముంచివేసాడు. వాడి రక్తం కూడా పరీక్షించాను. అందులో విషక్రిములున్నయ్! ఇంజక్షనులు ఇవ్వకుంటే చనిపోయేవాడే!— మరి ఏంచేయాలో చెప్పండి. దయ, కరుణ, మమత మొదలైనవాటిల్లో చిక్కుకున్న నా స్వంత డబ్బుతో చికిత్స మొదలుపెట్టాను దానికి ఫలితం ఏమైందో ఎరుగుదురా?"

"వాడికి నయమైందనుకుంటాను."

"లేదండీ లేదు. రెండు ఇంజక్షనులు చేసేప్పటికి వాడు మళ్ళీ ఇటు తొంగిచూడలేదు. ఆ తర్వాత వాడు రామ్‌జీ అనే నాటువైద్యుడిదగ్గర మందుతింటున్నాడనీ, వాడితల్లి తన చేతి మురుగులు అమ్మి ఆ వైద్యుడికి డబ్బు ఇచ్చిందనీ తెలిసింది. చూసారా? ఇప్పుడు మీ రేమంటారు?"

"లోకంలోని దీనులూ, దరిద్రులూ, అంతా అలానే కృతఘ్నులూ—ద్రోహులూ అవుతారని మీరెలా చెప్పగలుగుతారు?"

"ఓ ...హో ...మీరు ఇంకా గ్రహించనే లేదన్నమాట! ఇది కృతఘ్నతకాని, ద్రోహంగాని కాదు. దీన్నే- మానవస్వభావ మంటారు. ఇదే మానవస్వభావం! ఏది సహజంగా దొరుకుతుందో, ఏది చాలా సులభమో దానికి మనం విలువకట్టలేము. అటువంటివాటికి మనం విలువను ఇవ్వంకూడా! దొరకనిదాని

కోసం మనమంతా ఆకర్షించబడడం స్వాభావికం. దానికోసమే మీరూ, నేనూ, అందరమూ పరుగులుపెడతాం!"

"అంటే—?"

"అంటే ఏముంది? ఇవాళ మీకు టైఫాయిడ్ వచ్చిందనుకోండి; మీరు నన్ను పిలిచారనుకోండి; నేను మీదగ్గర ఫీజు డబ్బు పుచ్చుకోకండా, మందు ఖరీదు కూడా పుచ్చుకోకండా చికిత్స చేస్తున్నట్లయితే - మీరు మహాఅంటే నావగ్గర రెండు మూడు రోజులకంటే ఎక్కువకాలం తినరు. ఒకవేళ అంతగా తినే పెద్దమనిషైతే "చూడండి. మీరు చెప్పినట్లయితే ఫలానా డాక్టరుగారి సలహాకూడా తీసుకుంటాను." అని అడుగుతాడు. ఆ తర్వాత ఆ ఫలాని డాక్టరుకు ఫీజు ఇచ్చి, అతనికి నాడిచూపించి సంతోషిస్తాడు. ఖర్మంకాలి గొప్ప ధనవంతుడైతే అక్కడితో ఆగక ఏ రైల్వే డి. యం. ఓ నో — చాలా డబ్బు ఖర్చుపెట్టి మద్రాసునించో, కలకత్తానించో పేరుగల డాక్టరు నొకర్ని పిలిపిస్తాడు. పిలిచి ఆయనముందు నన్ను రకరకాల మాట లంటాడు. నెలల పర్యంతం ఆయన మందు తింటాడు. ఐనా—ఆ టైఫాయిడ్ అనుకున్న గడువుకు తగ్గదు. ఏదేమైనా—డబ్బుతోకాని ఈ శని విరగడకాదు. "ఫలానా డాక్టరు దయాస్వభావుడు. బీద వాళ్ళదగ్గర డబ్బు పుచ్చుకోడు." అని అనడం వొట్టి నోటిమాటలు మాత్రమే! – ఎవరికన్నా బాగా జబ్బుగావున్నప్పుడు ఫీజు పుచ్చుకునే డాక్టర్ను పిలవకండా, తెల్లదొరల్ని పిలవాలనుకుంటారు. ఇదీ మానవస్వభావం—"

"ఇదంతా నాకు తెలీదండీ డాక్టరుగారూ!" అని మెల్లగా గొణిగాడు వకీలు.

"తెలిసీ, తెలియకుండావుండే సంగతి కా దిది. నూటికి నూరుపాళ్లు నిజం. ఇంతెందుకు: మీరు ఈ నందగోపాలుణ్నే తీసుకోండి. ఎంతమంది డాక్టర్ల వద్ద ఇతను మందు తిన్నాడు. సరిగ్గా డబ్బెవరికీ ఇచ్చివుండడు. డాక్టర్లూ వైద్యులూ అతన్ని పీల్చి పిప్పిచేసి వదిలినప్పటికీ, దేహారోగ్యాన్ని మాత్రం పొందలేక పోయాడు."

"అవును. మీరన్నది నిజం. వాడిని అంతా దయగానే చూశారు."

"ఇప్పటికన్నా తెలుసుకున్నారా? అందుకనే నే నెవర్నీ నమ్మను."

"అయితే మరి—మీరు సాయంకాలం...."

"ఆ... ! షుమారు అయిదుగంటలకు—"

వకీలుగారు వెళ్ళిపోయారు వేను కుర్చీలోంచి లేద్దామనుకుంటూండగా తోలుసంచి తీసుకొని ఒక ఏజంటు ముందుకు వచ్చి—"నమస్తేండి డాక్టరుగారూ! మీకోసం మూడురోజుల్నుంచీ తిరుగుతున్నాను. కానీ,—తమదర్శనం కాలేదు. నేను ఫలానా కంపెనీకి ఏజంటుగా పనిచేస్తున్నాను" అంటూ ఆయన తన పరిచయాన్ని వెల్లడిచేసే కార్డును నాకిచ్చి, సంచి తెరుస్తూ "ఇదిగో చూడండి, మాకంపెనీ కేటలాగు. మీకిచ్చే కమీషన్ వివరాలుగూడా అందులోనే వున్నాయ్. తమకు ఈ డైరీ ఉచితం. మా మందుల నమూనా చూడండి" అన్నాడు.

"ధన్యవాదాలు"

ఒక ప్యాకెట్ తీసి "మీరు దీన్ని వాడిచూసేవున్నారనుకుంటాను" అన్నాడు.

"లేదు—లేదు. ఒక్కరోగికికూడా వాడి చూడలేదు. నేను దీని పేరుకూడా మర్చిపోయాను"

ఆయన నవ్వి "ఒకసారి ట్రైచేసి చూడండి. థైసీస్‌కు [క్షయరోగానికి] ఈ మందు చక్కగా పనిచేస్తుంది. కలకత్తాలో "అ", 'బ', 'స' డాక్టర్లు ఎక్కువగా ఈ మందునే వాడుతూ వుంటారు" అని సంచిలోంచి కొన్ని కాగితాలు నాకిస్తూ "డాక్టర్ల ప్రశంసాపత్రాలుకూడా చూడండి." అన్నాడు.

డాక్టర్లు సర్టిఫైచేసిన కాగితాలు చదివాక నా ఒళ్లు మండిపోయి "చూడండి! వీళ్ళసంగతి నాముందు ఎత్తకండి. ఇలానే మాట్లాడుతూంటే మీమీద నాకున్న కొద్దిపాటి విశ్వాసంకూడా పోతుంది. ఈ డాక్టర్ల విషయంలో నా అభిప్రాయం ఏమిటో తెలుసా?"

"ఏమిటంటారు?"

"వీళ్లంతా డాక్టర్లబిరుదు తగిలించుకున్న మానవద్రోహులు. డాక్టర్ సర్టిఫికెట్‌తో పేటెంటుమందులు అమ్ముకుని వ్యాపారం చేసుకుంటుంటారు. వీళ్ళకు దేశంలోని విచారం, రోగులబాధ - ఏవీ అవసరంలేదు. ఏమందు ఎక్కువగా పత్రికల్లో ప్రచురింపబడుతూవుంటుందో, ఏమందుకు ఎక్కువగా పబ్లిసిటీ యిస్తుంటారో, ఏమందుకు కంపెనీవాళ్లు ఎక్కువగా కమీషన్ ఇస్తుంటారో, ఆ మందుల్నే రోగులకు రాసిస్తుంటారు. ఇంతకూ అసలు తమాషా ఎక్కడుందో తెలుసా? ఏ డాక్టరు ఎక్కువ ఖరీదుగల చీటి రాసిస్తాడో, వాడే గొప్పవాడని అమాయకపు ప్రజలు నమ్ముతారు. నిజమైన డాక్టర్లెవ్వరూ దేశద్రోహులైన ఇటువంటి డాక్టర్ల సర్టిఫికెట్లకు విలువ ఇవ్వరు. ఐనప్పటికీ ఒకొక్కప్పుడు రోగుల కోరిక ప్రకారం, వాళ్ళ ప్రార్థనలవల్ల మానవ

రాక్షసులైన ఈ డాక్టర్ల గుమ్మంలోకి మేముకూడా వెళ్ళాల్సొస్తుంటుంది."

"రోగుల కోరికతోనా?– ఎందుకని?"

"అంతకు ముందు ఎక్కడో పత్రికలోని ప్రకటన్నో, గోడమీది పబ్లిసిటీనో చూసుండి, ఆ డాక్టరుకు చూపించనిదే జబ్బు పోదనీ, ఖరీదుగల ఆ మందును తిననిదే జబ్బు నయం కాదనీ ఒకవిధమైన నమ్మకాన్ని మనసులో ఏర్పరచుకుంటారు. ఐనా రోగులు విజ్ఞానం గలవాళ్ళుకారు. వాళ్లేనో మనసులో ఒక మందుమీదనో డాక్టరుమీదనో గురిపెట్టుకుని మన దగ్గరకు వచ్చి, మనతో చికిత్స చేయించుకుంటూ మాటలసందర్భంలో బైటపెడతారు. దూరంగావున్న వస్తువుమీదకే మానవ స్వభావం పరుగెత్తుతుందనే నగ్నసత్యం తెలుసు కాబట్టి, అతడినమ్మకాన్ని ఎందుకని కాదనాలి? జబ్బు మావల్ల నయం కానప్పుడు, రోగి డబ్బుగలవాడైనప్పుడు, మే మతని అభిప్రాయానికి విరుద్ధంగా ఎందుకు నడవాలి? ఏవరో అటువంటి డాక్టరుకు మెల్లగా రోగిని వొప్పగించి జారుకుంటాము సరే పోనీండి; ఆ గొడవంతా దేనికి. మీరు ఏకరువుపెట్టిన డాక్టర్లలిస్టుమీద నా కేమీ విశ్వాసం లేదు వీళ్ళంతా వ్యాపారస్థులూ, బుద్ధిమంతులూ, ధనవంతులూ అయితే అవొచ్చుగాని - విజ్ఞానవేత్తలు మాత్రం కారు."

ఆ ఏజంటు కొంచెంసేపు మెదలకండా వూరుకుని "మీరు చెప్పినమాటలు నిజం కావచ్చు. కానీ, మే మేం చేయమండి? కడుపుకక్కుర్తికోసం ఏదో ఒకటి చేయాలికదండి. మా తిప్పలు మావి! ఏమందు చెడ్డదో, ఏమందు మంచిదో ఆ సంగతి మీకు తెలియాలి. నేను గనుక ఈమందు మంచిదని

చెప్పకపోతే ఈ మందును యిక్కడెవరూ కొనరు. ఈ ప్రాంతంలో ఎక్కువ అమ్మకం చూపించలేకపోతే-వెంటనే నన్నిక్కణ్నుంచి ఏ అస్సాంకో, ఇంకెక్కడికో పంపించివేస్తారు. లేదా - నా నౌకరీకి నీళ్ళువొదులుకోవాల్సివొస్తుంది." అన్నాడు.

తళతళలాడుతున్న సూటు లోపల్నుంచి ఒక దీన దరిద్ర నికృష్టజీవి ప్రత్యక్షమై, నన్ను ద్రవీభూతుణ్ని చేసాడు.

అతనితో నే నింకేంచెప్పను? పాలిపోయిన మొహాన్ని బైటపెట్టుకుంటూ పిరికితనంగా నాముందు కూచుని నన్ను చూస్తున్నాడు. కొంచెంసేపు ఆలోచించి "సరే-ప్రయత్నించిచూస్తాను. ఐనా ఈ మందు ఏమందులో కలిపియివ్వాలో అవేవీ నాకు తెలియవే!" అన్నాను.

"కలకత్తా డాక్టర్లు పూరికే రాసిస్తారు."

"అవును; మరి— నేను కలకత్తా డాక్టరునుకాను. ఆఖరికి అప్ టు డేట్ మనిషినికూడా కాను. ఈ మందును గురించి నేను ప్రశంసాపత్రం మీ కంపెనీకి రాసిస్తే, నేను అవమానింపబడతానేమో! ఈ కారణంతో నా దగ్గరికి వచ్చేరోగులు కూడా మెల్లిగా ఇక్కణ్నుంచి జారిపోతారేమో! --సరే మీరు ఆ మందును వుంచి వెళ్ళండి. ఆ సాహిత్యంకూడా వుంచండి! చదివిచూస్తాను."

ఏజంటు మందుబుడ్డీ, మందుతాలూకు సాహిత్యమూ బల్ల మీదపెట్టి, నమస్కరించి వెళ్ళిపోయాడు.

పదినిమిషాలు గడిచాయోలేదో, హారాన్-ఆయనపక్కింటి కుముదబాబు వచ్చారు. కుముదబాబు బాగా వున్నవాడు; రావడంతోనే "డాక్టరుగారూ, ఇంకెంతకాలం క్వైనైను ఇవ్వాలి?" అని అడిగాడు.

"ఇంకా రెండురోజులు పోనీండి—"

"ఇప్పుడుకూడా క్వినైను ఇవ్వడం బావుంటుందా? అంతా ఇదొకవిధమైన విషమని అంటుంటారే; తింటూవుంటే ఒళ్ళంతా మండుతూవుంటుందట—"

వెంటనే లేచి అతని చెంపమీద కొడదామనిపించింది. కానీ - కొట్టలేకపోయాను. నవ్వుతూ "కాదండీ; క్వినైను విషం కాదు" అన్నాను.

వాళ్లు వెళ్లిపోయాక రాంచరన్‌సింగు వచ్చాడు. పౌరుషం గల క్షత్రియుడు. ఎందుకని కోపంవచ్చిందో, ఆ మనిషి తల ఎందుకని పగులకొట్టాడో తెలీదు కాని, ఆ పగిలిన తలకు చికిత్స మాత్రం నేను చేస్తున్నాను. ఆ రాకూరుగారు ఒక నివేదన తీసుక వచ్చాడు. దాని సారాంశం, కోర్టులో నేను సాక్ష్యమివ్వాలిట! ఆసామీ తల కఱ్ఱదెబ్బకు పగులలేదనీ, క్రింద పడడంవల్ల పగిలిందనీ చెప్పాలట! ఈ మాటమాత్రం చెబితే రాకూరుబాబు నాకు చాలా పైకం ఇస్తాట్ట!

నేను చెప్పనన్నాను. ఆయన ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయాడు....

గడ్డిపోచలు గాలికి కొట్టుకుపోతున్నాయ్!—

సాయంత్రం ఐదుగంటలకు నందగోపాలుని చూసేందుకు వెళ్లాను. బైట ఎవరూ లేరు. తలుపు సందులోంచి తొంగి చూసాను. లోపల ఐదారు మేకలు కట్టివేసి వున్నయ్. పక్కన చూసేప్పటికి అక్కడకూడా మేకలు వున్నాయ్. ఎదురుగా వున్న వసారాతడికలోంచి రెండు మూడు మేకలు తలలు బైటికి పెట్టి

దర్శనమిచ్చినయ్. వరండా అంతా మేకలతోనే నిండిపోయింది. ఏమిటీ మేకలు? ఇది మేకల రాజ్యమా——?

కూర్చునేగదిలోపలికి వెళ్ళి, ఎలాగో లోపలికి కబురు చేశాను. ఆ గదినికూడా నాలుగు వేపులా పరికించి చూసాను. అక్కడకూడా మేకలే! చాలా సంతోషంగా అవి అటూ ఇటూ పచార్లుచేస్తున్నయ్. అయితే వీళ్లు మేకలవ్యాపారం చేస్తున్నారా ఏమిటి?–

నాకేమీ పాలుపోలేదు. ఆ సమయంలోనే వకీలుగారు వచ్చారు. వకీలుగారికి వీళ్ళకూ దగ్గరి చుట్టరికమేమో! ఆయన నమస్కరించి "లోపలికి వెల్దాం పదండి–" అని అన్నాడు.

రోగి గదిలోకి వెళ్లాం. అక్కడకూడా మేకలు నిలబడి వున్నయ్. వీళ్లబుద్ధి ఫెడదారిపట్టిందా యేం? చివరకు విసుగుతో "ఇక్కడ ఎక్కడచూసినా మెకలే వున్నయ్. వీళ్ళు మేకల్ని అమ్మతారా ఏమిటి? ఎటు చూసినా అవే కనిపిస్తున్నాయ్?–" అని అడిగాను.

"ఇతనికి శ్వాసకోశాల్లో జబ్బు వుందనీ, ఆ కారణంతో ఇంట్లో రోగిమంచంచుట్టూ మేకల్ని వుంచాలని వైద్యుడు చెప్పాడు. అందుకని–"

ఆశ్చర్యమే! మేకలసేనలు ఇందుకనా యిక్కడ పోషించబడడం?——

రోగి స్థితి చూశాను.

శుష్కించిపోయిన నందగోపాలుడు మంచంమీద పడివున్నాడు. ముఖంనిండా తెల్లని గడ్డం, మీసాలూ వున్నయ్. ప్రతి ఐదు నిమిషాలకు దగ్గు తెరలు వస్తూవున్నయ్. ఎప్పుడూ జ్వరం

వుంటూనే వుంది. ఆతనికి క్షయరోగమని తెలుసుకునేందుకు ఏమీ ఆలస్యం కాలేదు వైద్యుడు రోగాన్నికనిపెట్టాడు కావాలు. జబ్బుసంగతి బైటపెట్టలేదు. "ఈ మేకలు ఇక్కడ ఎంతకాలం నించి వుంటున్నయ్?—" అని అడిగాను.

ఆ దగ్గర్లోవున్న గదిలోంచి ఒకఆడగొంతుక "నా పెళ్ళయి నప్పట్నుంచీ ఆ మేకల్ని చూస్తూనేవున్నాను" అని అనడం వినిపించింది.

వెనక్కి తిరిగి చూసాను. పరదా చాటున నిలుచుని ఎవరో నామాటలు వింటూన్నట్లుంది-"సరే. ఈ మేకలుండడం ఈజబ్బుకు కొంత నయమే." అన్నాను.

పరదా చాటునుంచి ఈసారి జవాబు రాలేదు.

"మనం బైట కూర్చుందాం పదండి! రోగిని పరీక్షిం చారు కదూ?" అని వకీలుగారు అడిగారు.

"ఆ.... పదండి!"

బైటకు వచ్చేప్పటికి నేను కూర్చున్న కుర్చీలో ఒక గడ్డాలపోతు కూర్చుని వుండడం చూసాను. "ఈ ఇంట్లో ఈ మేకలు చాలా అడ్డంకిగా వుంటూన్నయ్?" అన్నాను.

"అడ్డంకా? ఇప్పుడు ఏ మేకనన్నా మీరు కొట్టిచూడండి, నందగోపాలుడి తల్లి మిమ్మల్నేంచేస్తుందో చూద్దురుగాని."

"ఐతే—నందగోపాలుడితల్లి బ్రతికేవుందా?"

"ఆఁ—! బ్రతికేవుంది.. ..సరేగాని, మీరు జబ్బేమిటో చెప్పారుకారు."

"ఈ జబ్బును గురించి చెప్పకండా వుండడమే మంచిదను కుంటాను."

"అంటే—?"

"ఏముంది? ఇతను బ్రతకడం చాలా కష్టం! ఇతనికి క్షయ—"

తొందర తొందరగా తన కళ్ళజోడు తుడుచుకుంటూ "మీరు చెప్పింది నిజమేనా? ఐతే-టి. బి. అంటే, అంటురోగం కదూ?" అని అడిగాడు.

"అవును—"

"ఇది టి. బి. అని మీకు స్పష్టంగా తెలుస్తుందికదూ?"

"నాకింకా అనుమానంగా వుంది. ఏ రోగాన్నైనా నేను నిశ్చయంగా చెప్పడానికి తొందరగా సాహసించను. ఇతనికి టి. బి. అని నాకు అనుమానం. ఉమ్మి పరీక్షించాక నిర్ధారణగా చెబుతాను."

"అదికూడా పరీక్షచేయండి."

"రేపు ఉదయమే రోగి తాలూకు ఉమ్మి నా దగ్గరకు పంపించండి. ఈ విషయం రోగికి ఎంతమాత్రం చెప్పకండి. రోగికి చెబితేమాత్రం నేను మందివ్వను. ఇప్పుడు వాడుతున్న డాక్టరు దగ్గరే మీరు మందు తినాలి, నన్ని విషయంలోకి మాత్రం లాగకండి—"

"కాదు....కాదు. అలా ఎప్పటికీ కాదు. ఈ కేసును మీరు మీ చేతుల్లోకి తీసుకోవాలి. అందరికంటే మాకు మీమీదనే నమ్మకముంది."

ఏమీ మాట్లాడకండా ఉదయం ఏజంటు తాలూకు మందు రాసి, ఇచ్చి - ఇంటికి వచ్చేసాను. నేను వస్తూన్నపుడు వకీలు గారు ఫీజంతా యిచ్చారు.

ఆ మరునాడు రోగి తాలూకు ఉమ్మి పరీక్షించాను. టి. బి. అని స్పష్టమైంది.

తప్పనిసరిగా ప్రతిరోజూ సాయంకాలం మృత్యుముఖంలో పడివున్న నందగోపాలుడి ఇంటికి వెళ్తున్నాను అతను బ్రతకడని తెలిసున్నా వెళ్లడంమాత్రం తప్పడంలేదు. ఎన్నో విషయాలు చెప్పాల్సివస్తుంది. టి. బి. అని తెలిసాక వకీలుగారు అటువేపు రావడమే తగ్గించాడు. ఆయన బుద్ధిమంతుడు!

ఒక నెలరోజులు గడిచిపోయినయ్ ఆనాడుకూడా యధాప్రకారం అతనింటికి వెళ్ళాను. ఆ ఇంట్లో మూడే మూడు ప్రాణులు: రోగి - అతనితల్లి - భార్య!

నందగోపాలుడి తల్లి నన్ను "నాయనా' అని పిలుస్తుంటుంది. అతనిభార్య కూడా నా ముందుకు వస్తూ, మాట్లాడుతూనేవుంది. ఆ యమ్మాయి వయసు చాలా తక్కువ; ఇరవై, ఇరవై ఒక్కటి వుంటాయేమో!

ఆనాడు వెళ్లేప్పటికి అతనిభార్య అద్దంముందు నిలుచుని తలదువ్వుకుంటూ వుంది. అద్దంలో నా ప్రతిబింబం చూసి తల మీదకు గుడ్డను లాక్కుని "రాండి" అని అన్నది.

"అమ్మెక్కడికి వెళ్ళింది—?"

"గుళ్ళోకి"

"నందగోపాలుడి కెలావుందో చూసి వస్తాను. ఇవాళ టెంపరేచరు ఎంత వుంది?"

"నూటఒకటి వుంది కాని, మీ రిప్పుడే వెళ్ళడానికి వీల్లేదు. అమ్మగారు వచ్చేంతవరకూ మిమ్మల్ని వుండమని చెప్పి

వెళ్ళారు........తల దువ్వుకొని, ఈ మేకల్ని ఒకపక్క కట్టి వేయాలి. ఇదే నాకు మంచి పనిగా కనిపిస్తుంది...."

నేను రోగిదగ్గరకు వెళ్ళి, కూర్చుని అతణ్ని చూసాను. అతడికి రోజులు దగ్గరకొచ్చినట్లున్నయ్.

"నా కిం కెంతకాలంలో నయమవుతుందండీ?" అని నంద గోపాలుడు అడిగాడు.

ఆయన్ని మాటలతో సంతోషపరిచాను.

ఎదురుగా వున్న గోడమీది గడియారం టిక్, టిక్ మంటూవుంది. నాలుగువేపులా మేకలు తిరుగుతూవున్నయ్.

నందగోపాలుడు దగ్గుతూనే వున్నాడు.

ఈ దారుణ పరిస్థితుల్లో పదిహేను నిమిషాలు అలానే కూర్చు న్నాను. ఆఖరికి బాగా చిక్కిపోయిన కుర్రవాణ్నెత్తుకొని రోగిభార్య వచ్చి "మీరు ఆగదిలోకి వెళ్ళి కూర్చోండి! అని పిల్లవాణ్ని చూసి "నువు మీ నాన్నదగ్గర కూర్చో బాబు" అని అన్నది.

నేను ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను. తనభర్త మృత్యు ముఖాన పడున్నప్పటికీ ఆమె శృంగారించుకోవడం నాకు ఆశ్చ ర్యాన్ని కలిగించింది! జుట్టు ముడిని ఆమె ఎంత అందంగా కట్టు కుంది! ఆ ముఖ మెంత అందంగావుంది! మెరిసిపోయే ఆ ముఖం మీద బొట్టెంతో అందంగా వుంది!....ఆ కుర్రవాణ్ని తండ్రిదగ్గర ఒంటరిగా కూర్చోపెట్టి ఆమె నాతో సరాగాలాడాలనిచూస్తూవుంది.

నేను బైటికివచ్చి "మనం నందగోపాలుడి దగ్గరే వుండడం మంచిది" అన్నాను.

"మీరు ఆశ్చర్యంగా మాట్లాడుతున్నారు. అమ్మగారు

వచ్చి నే నక్కడ కూర్చుని వుండడం చూస్తే, మహాభారతం చేసితీరుతుంది.

"ఎందుకని?—"

ఆమె కళ్ళల్లో ఒక మెరుపు మెరిసినట్లయింది. "నాకు పెళ్ళయి ఎంతకాలమైందో మీకు తెలుసా?—నాలుగు సంవత్సరాలే! మానాయన అన్నిసంగతులు తెలుసుకునికూడా నన్నీ శవానికిచ్చి పెండ్లి చేశాడు. అంతా నా అదృష్టం!.........ఈయనగారు తన జీవితాంతం వరకూ పెళ్ళిచేసుకోగూడదని, జీవితంలో యాభై సంవత్సరాలు నెట్టివేశారు. ఆతర్వాత ఈరోగం ఆయన్ను లోబరుచుకుంది. తల్లి ప్రోద్బలంమీద వంశం పోకండా-నన్ను పెండ్లి చేసుకున్నాడు.........ఈ వంశోద్ధారకుణ్ణి చూడండి." అంటూ నిద్రపోతున్న ఆ పిల్లవాడిమీద ఒక్క చరపు చరిచింది.

నిద్రపోతున్న పిల్లవాడు దెబ్బకు లేచి ఏడ్చాడు.

ఏమని చెప్పాలో ఆలోచించలేకపోయాను, నన్నెవరో వెనకనించి నెడుతున్నట్లనిపించింది. త్రుళ్ళిపడి తల తిప్పాను. అదే, ఆ గడ్డంమేకపోతు ఠీవిగా నిలుచునివుంది.

అది చూసి "నాకు పనేమిటో తెలుసా? కంపు కొట్టే ఈ మేకల్ని చూస్తుండడం, ఈ వంశోద్ధారకుణ్ని పోషించి, పెంచడం....ఇదే నా పని!" అని ఆమె అన్నది

ఈ సమయంలోనే బైటి తలుపుదగ్గర ఎవరిదో గొంతుక వినిపించింది. ముసలితల్లి – శుద్ధ రేషన్ చీర కట్టుకొని వస్తూండడం చూసాను. దేవాలయంలో భగవంతుడి ముందు, తన కొడుకును చిరంజీవిగా చేయమని, కాపాడమని, ప్రార్థించి వచ్చింది....

నేను ఇంటికి తిరిగి రావడంతోనే భజువ ఒక ఉత్తరం ఇచ్చాడు. వెలుతుర్లో దాన్ని చదవడంతోనే నాకు వున్నమతి పోయింది. అది ప్రేమలేఖ! ఎవరో కమలట! ఆమె తన ప్రాణేశ్వరుడికి తన ప్రేమలేఖ రాసుకుంది! కవరుమీద ఒకటికి రెండు సార్లు చూసాను. దానిమీద నా పేరే వుంది!— కేవలం 'డాక్టరు' అని రాయకండా "శ్రీయుత...." అని రాసుంది. నా కేమీ పాలుపోలేదు. ఈ కొత్త ప్రాణేశ్వరి నా కెక్కణ్నుంచి వూడి పడిందో?

నిజంగా ఆ ఉత్తరంమాత్రం నాదికాదు. ఎవరిదో ఏమో!— వంకరటింకర పంక్తులు! మధ్యమధ్య తప్పులూ, దిద్దులూ వున్నయ్. అక్కడక్కడ వేడుకోవడాలు, ప్రణయం తాలూకు దాహం, ఆ ఉత్తరంలో చిలుకుతూవుంది. చదివేందుకు చాలా బావుంది! ఎంతో సరళత్వమూ, కోరికా, ఆవేశమూ అన్నీ ఆ ఉత్తరంలో కనబడుతూ వున్నయ్. మెల్లిమెల్లిగా చదివి, అందులోని మధువును ఆస్వాదిస్తున్నప్పుడు నౌకరు వచ్చి "ఒకాయన బైట నిలుచుని మిమ్మల్ని చూడాలంటున్నాడండి—" అన్నాడు.

ఆ ఉత్తరం అలానే వొదిలిపెట్టి బైటకు వచ్చాను. ముక్కూ మొహం తెలియని అపరిచిత యువకుడొకడు నిలుచుని వున్నవాడల్లా, నన్ను చూడడంతోనే చేతులెత్తి నమస్కారించాడు. ఏదో ఒక వ్యాపారంమీద ఉదయం మెయిల్లో అతను ఇక్కడికి వచ్చాడట. అతడిపేరుతో ఓ అర్జంటు ఉత్తరం రావాల్సిందట! పోష్టాఫీసులో కనుక్కొని అతను ఇక్కడికి వచ్చాట్ట! అతనిపేరూ, నాపేరూ ఒకటేనని పోష్టుమ్యాను చెప్పాట్ట. ఆ

కారణంతో పొరబాటున తన ఉత్తరం ఇక్కడికి వచ్చిందేమోనని కనుక్కునేందుకు వచ్చాడట.......

అంతా విని "అవునవును. మీ ఉత్తరం వచ్చింది. పొరబాటున దాన్ని విప్పాను, క్షమించాలి" అన్నాను.

తన ప్రేమలేఖ తీసుకొని ఆ యువకుడు వెళ్ళిపోయాడు. నా మనసులో తరంగాలు లేచినయ్. నిద్ర రాలేదు. అటువంటి ఉత్తరం నా కెప్పుడైనా రాదా? ఈ నిర్భాగ్యుడికి రాసేవాళ్లులేరు; దేన్నయితే అనుభవిద్దామని మానవుడు ప్రయత్నిస్తాడో, ఏది అసంభవమో, అటువంటివాటికోసమే కిందు మీదవుతూ-గుటకలు మింగుతూ ఎన్నెన్నో స్వప్నాల్ని సృష్టించుకుంటూ జీవితాల్ని గడపడం మానవులకు బాగా అలవాటైపోయింది.

రాత్రి ఎంతగడిచిందోకాని, ఒక నక్షత్రంమాత్రం ఉజ్వలంగా ప్రకాశిస్తూ, కిటికీలోంచి తొంగిచూస్తూవుంది. ఒకవేళ కలకత్తా వెళ్ళినట్లయితే 'ఆమె'ను-కలుసుకోగలనేమో! ఈ ఒంటరిబాధ వుండదేమో! 'ఆమె' నన్ను చూసి పెడమొహం పెట్టదుకదా!—

* * *

ఇవాళ కవిత్వం రాయడానికి_నాకు ఉత్సాహంగా లేదు. పద్యంమీద పద్యం!-గేయంమీద గేయం! ఐతే-ఈ అక్షరాల్లోని ఉద్వేగం నా హృదయంలోని వ్యాకులపాటును వ్యక్తీకరిస్తుందా? ఐతే-సముద్రంలోని నీటిని గిన్నెలో పట్టినట్లే అవుతుంది. ఉదయపు ఆకాశం, వర్షాకాలంలోని దట్టమైన మేఘాలు, మెరుపులు, వురుములు, స్వచ్ఛమైన కోమలత్వం, ఎంతో మధురంగా-శబ్దాలు

వుచ్చరించలేని భాషలో అంకితమై వుంది. ఎంతో స్వచ్ఛంగా, ఎంతో స్పష్టంగా—వూహించలేని గొప్పతనంతో తొణికిస లాడుతూవుంది.

"డాక్టరుగారూ?"

తొట్రుపాటుతో బైటికి పరుగెత్తుకుని వచ్చాను. నంద గోపాలుడి ఇంటిపక్కన వుండే కన్నయ్య నిలుచునివున్నాడు.

"ఏం—ఎందుకని వచ్చావు?"

"తొందరగా రావాలి. నందగోపాలుడికి చాలా గాబరాగా వుంది."

పరుగెత్తుకుంటూ వెళ్ళాను. నందగోపాలుడు చనిపో యాడు. అంతేకాదు; ఇంకొక ఆపదకూడా వచ్చిపడింది. అతని పడుచుభార్య ఆ దగ్గర్లోవున్న నదిలో దూకించి.

"పట్టుకోండి పట్టుకోండి."

"పరుగెత్తు—పరుగెత్తు"

"రక్షించండి రక్షించండి."

ఆ వీధిలో నలుగురైదుగురు ఉత్సాహవంతులైన యువ కులు వెంటనే నదిలో దూకి ఆమెను వొడ్డుకు తీసుకొనివచ్చారు. ఉపచారాలు చేసింతర్వాత కడుపులోని నీరంతా బైటికి వచ్చింది.

చాలా సేపు గడిచింతర్వాత ఆమెకు స్పృహవచ్చింది. కళ్లు విప్పి నాలుగువేపులా చూసి "మీరంతా నన్నెందుకని రక్షించారు? మృత్యుముఖంలోంచి ఎందుకని బైటికి లాగారు? నాకోసం ప్రపంచంలో ఏముంది? ఆయనగారి జబ్బుకు వున్న దంతా ఆఖరైంది. దాంతోపాటు ఆఖరికి ఆయనగారుకూడా పోయారు. సహాయం చేసేందుకు గాని, ఓదార్చేందుకు గాని

అన్నదమ్ములు, తలిదండ్రులు ఎవరూ లేని నిర్భాగ్యురాలిని. కొన్ని రోజులు గడిచిన తర్వాత నా కొడుకు నా కళ్ళముందే అన్నంలేక — ఆకలితో గిలగిలకొట్టుకుని చనిపోతాడు. నా అనేవాళ్లు లేని ప్రపంచంలో నే నెందుకు పనికివస్తానని మీరు బ్రతికించారు? ఎందుకు బ్రతికించారు? ఎందుకు రక్షించారు?" అని వాపోయింది.

ఎవరూ ఏమీ జవాబు చెప్పలేదు.

# 10

ఇంకొక రెండు నెలలు గడిచిపోయినయ్,

చెప్పవలసినంత సంగతు లేమీ లేవు. డాక్టరుజీవితంలోని డైరీ వ్రాసుకోలేదు. ప్రస్తుతం 'టైఫాయిడ్'తో బాధపడుతూన్న ఇద్దరు రోగులికి చికిత్సచేస్తున్నాను. ఆ జబ్బు మాటి మాటికీ తగ్గుతూ హెచ్చుతూవుంది. నేనుమాత్రం ఉదయం సాయం కాలం, రెండుపూటలూ అక్కడికి వెళ్ళి, చూసి—నా ఫీజును వసూలుచేసుకుని వస్తూనేవున్నాను.

హారాన్ భార్యకు 'క్షయ' వచ్చింది. ఆమెకు బ్రతకాలని వుంది కాని, బ్రతికేమాట అబద్ధం! రోజూ ఆమెను వూరడిస్తూ "నీకేమమ్మా; చాలా తొందరగా నయమవుతుంది. విచారంతో భయపడడం మంచిదికాదు" అని ధైర్యం చెప్పి వస్తూనే వున్నాను."

హారాన్ ప్రస్తుతం ఎందుకనో నామీద నిగ్రహంపూనాడు.

ఆ విషజ్వరపు రోగికి నయమైంది కాని, హఠాత్తుగా అతడికి పోట పెరిగింది.

మలేరియా, క్షయ మొదలైన జబ్బులకు అంతం లేనట్లే మా అజ్ఞానానికి కూడా అంతం అనేది లేదు. ఐనప్పటికీ, మునిగి పోయే మనిషి నీటిలో కొట్టుకుపోయే గడ్డిపోచను చూసి, దాన్ని పట్టుకునన్నా బతికేందుకు ఏవిధంగా ప్రయత్నిస్తాడో, ఆవిధం గానే మాపనులు తయారైనాయ్. ప్రవాహానికి కొట్టుకపోయే గడ్డిపోచల్లాంటి డాక్టర్లను చూసి, మునిగిపోయే మానవులు మావేపు చేతులు చాపుతారు....మానవుల్లోని శాశ్వత దుర్బలత్వం ఇక్కడే బైటపెట్టుకుంటారు.

రసూల్‌పురం జమీందారిణి ఆరోగ్యం కొంచెం కుదుట పడింది. ఆమె నన్ను 'బాబూ' అనిపిలుస్తుంటుంది. నేనంటే ఆమె కెంతో శ్రద్ధాసక్తులు! మేనేజరు 'కుంజలాల్' నన్నొక దేవుడిగా భావిస్తున్నాడు. రాణిగారి జమీందారీలోనివారంతా నా ప్రాక్టీసుకే వస్తున్నారు.........

"డాక్టరుగారూ—!"

"ఎవరు? -లోపలికి రావొచ్చు—"

రంగబజారులో వుండే 'అస్మానీ' లోపలకు వచ్చింది. కానీ, ఇదేమిటి? అస్మాని ముఖం ఇలా వుందేమిటి? ఖంగు ఖంగున దగ్గుతూవుంది. లోపలకు వస్తూనే అస్మాని గబాలున కూలబడింది.

"వొంట్లో బావుండడంలేదా?"

"అవునండి; నెలరోజుల్నుంచి జ్వరం వొదల్లేదు. మీదగ్గ రకు కబురుచేదామంటే ఇంట్లో ఎవరూ లేరు. ఫీజిచ్చి పిలిపిద్దా

మనుకుంటే—నాదగ్గర దమ్మిడికూడా లేదు ఎలానో, లేస్తూ—పడుతూ, ఇక్కడికి వచ్చాను" అని ఆస్మాని ఆయాసపడింది.

ఆమె నాడీ, కంఠం, హృదయం, అన్నీ పరీక్షించాను. ఇప్పుడుకూడా జ్వరం వుంది, వొదల్లేదు "నోట్లోంచి ఎప్పుడన్నా రక్తం పడిందా?" అని అడిగాను.

"నాలుగైదురోజులనాడు కఫంతోపాటు కొంచెం రక్తం కూడా పడింది. దగ్గుతూవుంటే నా గొంతుక బాధతో పగిలిపోతు న్నట్లుగా వుంటుంది డాక్టరుగారూ?"

"రాత్రులు చెమటపడుతుందా?"

"ఆ—పడుతూనే వుంది. దిండ్లూ, పరుపూ అన్నీ తడిసి పోతున్నయ్."

భయంకరమైన రోగంతాలూకు పంజాలో ఆస్మాని ఇరుక్కుందని గ్రహించాను. క్షయరోగం పట్టుకుంది. ఆస్మాని జీవితరంగంలో ఆఖరితెర పడిపోయేందుకు సిద్ధంగావుంది.

ఆమెకు మందు రాసిచ్చాను. ఆమె వెల్తూ వెల్తూ "మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?" అని అడిగింది.

"నువు రానవసరంలేదు. నే నెప్పుడు అటువేపునుంచి వెల్తుంటానో, అప్పుడు మీ ఇంటికి తప్పకండా వచ్చి చూస్తాను. ఫీజు అవసరంలేదు మీ ఇల్లెక్కడ వుంది?"—

"అదేనండి! శివాలయాని కెదురుగా చిన్న వీధి వుంది చూసారూ, ఆ వీధిలోనే–" అని నమస్కరించి వెళ్ళిపోయింది.

హరీశ్‌బాబు వచ్చాడు. అతని భార్య కడుపుజబ్బు నా మందులవల్ల నయమవుతూవుందట!-పైగా నేను గొప్ప మర్యాద కలవాణ్ణట! అదీగాక ఖగేంద్రుని నిందిస్తూవుంటే నేను విననందు

వల్ల మరీ గొప్పవాణ్ణట! బహుశా హరీశ్‌బాబు కోరికకూడా ఇదే కావొచ్చు! ఐనా-ఆయనగారి కోరిక పూర్తికాలేదు. ఆ రోజున అతనితో నిస్సంకోచంగా "చూడండి. ఒకరిని నిందించేందుకూ, మరొకరిని స్తుతించేందుకూ ఇది స్థలంకాదు. ఇదంతా మీరు క్లబ్బులో వినిపించండి. ఇక్కడ ఒక్క రోగంసంగతీ, మందుసంగతే-మాట్లాడాలి" అని హెచ్చరించాను.

"దీన్ని మీరు నిందంటారా? ఖగేంద్రుడు హంతకుడు కాడంటారా? బీదవాళ్ళ గొంతులు కోయడంలేదంటారా? ఈ సంగతి అతని ముఖంమీదే అడుగుతాను నాకేం భయమా? నేనతని సొమ్మేమైనా తింటున్నానా?...." అని హరీశ్ అంటున్నాడు.

"అత నెటువంటివాడైనా-ఇటువంటి మాటలు నాదగ్గర అనడం బావుండలేదు."

"సరేలెండి-"

ఆనాటినించీ హరీశ్‌బాబు శాంతించాడు.

నేను బైటకు వెళ్ళడానికి సిద్ధంగా వున్నాను. హరీశ్‌బాబు గబగబా నాదగ్గరకు వచ్చి "డాక్టరుగారూ, ఒకమందు కొనుక్కుని వచ్చాను, చూడండి, మంచిమందనుకుంటాను. మీకు తెలియకండావుంటుందా?" అన్నాడు.

నే నా మందుబుడ్డి తీసుకుని చూసాను. నపుంసకులు వాడే మందది!-"ఈ మందుసంగతి నాకు బాగా తెలీదండి! ఐనా-ఈ వయసులో మీ రీ మందులన్నీ ఎందుకని తినాలనుకుంటున్నారు?"

"కాదు కాదు. నాకోసం కాదండి. మా స్నేహితుడికోసం."

హరీశ్‌బాబు ఎన్నోరకాలుగా చెప్పడానికి ప్రయత్నించాడు గాని, ఆ మందు అతనికేననే సంగతి చాలా సులభంగా గ్రహించ

గలిగాను. నా హృదయంనిండా తెలియని విరక్తి ఒక్కసారిగా నిండిపోయింది. అతనితో మాట్లాడకుండా బైటికి బయల్దేరాను....

మల్లిక్‌ఇంటికి వచ్చేప్పటికి సూర్యోదయం కాబోతూ వుంది. మల్లిక్ అపూరివాడే. చాలా పిసినిగొట్టుమనిషి; ధనవంతుడుకూడా! నిమోనియావల్ల అతని కొడుకు పోయాడు. అక్కడే నల్లమందుభాయి మహేంద్రుడితో నాకు పరిచయం కలిగింది.

ముసలివాడైన మల్లిక్, విరిగిపోయిన పేముబెత్తాల కుర్చీలో కూర్చునివున్నవాడల్లా నన్ను చూసి, లేచివచ్చి నమస్కరించి—"రాండి! డాక్టరుగారూ దయచేయండి." అన్నాడు.

కొంచెంసేపు ఆగి "ఇంతకూ జబ్బెవరికి?" అని అడిగాను.

"నా భార్యకు వేలువిడిచిన అన్నగారు. అతని ఆరోగ్యమేమీ బావుండడంలేదు. అప్పుడపుడు ఇక్కడికి వస్తూ పోతూ వుంటాడు. పాపం, ఈసారి రావడంతోనే జబ్బునపడ్డాడు."

"మహేంద్రబాబు ఎక్కడికి వెళ్ళాడేం?"

"ఆ వెధవసంగ తెవరికెక్కావాలండి" అంటూ వృద్ధుడు లోపలికి వెళ్ళాడు.

మల్లిక్‌కు నాఅనేవాళ్లెవరూ లేరు. ఆ పడుచుపెళ్ళానికి ఎప్పుడు చూసినా తలనొప్పి! మల్లిక్ లక్షాధికారని అందరూ అనుకుంటుంటే ఎన్నోసార్లు విన్నాను. కానీ, వొంటిమీది గుడ్డలూ, ఇల్లూ, అతని వాలకమూ చూస్తే, అతనిదగ్గర ఇంత డబ్బుంటుందని ఎవరూ అనుకోరు మహేంద్రుని మాటలు నాకు గుర్తుకు వచ్చినయ్ ...!

మల్లిక్ తిరిగివచ్చి—"పదండి, ముందు శ్యామ్‌లాల్‌ను చూడండి. ఆతర్వాత 'టీ' పుచ్చుకుందాం" అని అన్నాడు.

శ్యామ్‌లాల్ నాడి చూసాను. జ్వరం వున్నమాట నిజమే గాని, విచారించవలసినంతగాని గాబరాపడవలసినంతగాని లేదు. వున్న కొద్దిపాటి జ్వరంలో కూడా అతని ముఖం కళకళ లాడుతూ వుంది. మంచి బలంతోనూ, ఆరోగ్యంతోనూ వున్న యువకుదేమో అత నా జ్వరాన్ని లక్ష్యపెట్టడమేలేదు. సాధారణమైన మలేరియా తప్ప, ఇంకేమీ లేదు. అటువంటప్పుడు తెల్లవారక ముందే పిసినిగొట్టయిన మల్లిక్ గాబరాపడుతూ నన్నెందుకని పిలిచాడు? ఎందుకు........? దేనికోసమని ? —

నాకేమీ అర్ధంకాలేదు.

వృద్ధుడి పడుచుపెళ్లాం అతని చెవిలో "మీరు వెళ్ళి స్నానంచేసి రాండి! అప్పటివరకూ డాక్టరుగారు శ్యామ్‌లాల్‌ను చూస్తుంటారు" అని సన్నగా గుసగుసలాడింది.

"ఆ....ఆ....వెళ్తున్నాను" అంటూ వృద్ధుడైన మల్లిక్ తొందరగా బైటికి వెళ్ళిపోయాడు.

మెల్లిమెల్లిగా విషయం అర్ధమైంది. శ్యామ్‌లాల్ విషయంలో మల్లిక్ ధర్మపత్ని ఎంతగా వ్యాకులపడుతుందో చూసాను. రకరకాలైన సంగతులు అడుగుతూ "దానిమ్మపండ్లు రోజుకు ఎప్పుడెప్పుడు ఇవ్వాలి. పట్టణంలోంచి ఇంకా ఏయే మందులు కొనుక్కురావాలి? జ్వరం తగ్గింతర్వాత గాలి మార్పుకోసం ఆబూ, సిమ్లా, మంసూరీ, షిల్లాంగ్, లేక పూరీ మీయిష్టం ఎక్కడికి పంపించమంటారు." అని చివరకు "ఆయనగారు ఈఖర్చు భరించలేకపోతే నా డబ్బులోంచి నే నిస్తాను. మీరు ఏ మందులు వాడాలనుకుంటే ఆ మందులన్నీ ఒక లిష్టువ్రాసి నాకివ్వండి.

మీరు దయచేసి శ్యామ్‌ని పాలు తప్పక త్రాగుతూవుండమని చెప్పి వెళ్ళండి. పాలంటే ఎంత బలంగల వస్తువో ఇతనికి తెలియదు" అన్నది.

నేను శ్యామ్‌లాల్‌తో "ఏం, పాలు తాగడానికి నీకెందు కంత కష్టం? పాలు తప్పకండా తాగవయ్యా." అన్నాను.

సగం తెరిచిన కళ్ళతో ఆమెవేపు చూస్తూ శ్యామ్‌లాల్ నవ్వుతూవుండడం గమనించాను స్నానంచేసి వృద్ధమల్లిక్ వచ్చి, నాతో "పదండి, బైటికి వెళ్ళి కూర్చుందాం." అన్నాడు.

బైటికి వెళ్ళి కూర్చున్నతర్వాత టీ తెప్పించాడు. ఆ టీ రుచిని ఏమని రాయను? వేడినీళ్ళు తాగుతూన్నట్లుగావుంది. టీ కాదు పాలు లేవు. పంచదార అసలేలేదు. వొఠ్ఠి వేడినీళ్ళు!

నాముందు మల్లిక్ ఉదయపు ఫలహారం పుచ్చుకుంటు న్నాడు. ఫలహారంలో కలకండ వుంది. ఆ కలకండ తినేవిధం చూసి ఆశ్చర్యపడ్డాను. ముక్కను నమలడంలేదు. నాలుకను ముందుకు చాపి దానిమీద రాస్తున్నాడు. అన్నీ ఇంతేకామోలు!....

నేను చూస్తున్నానని గమనించి నవ్వుతూ "డాక్టరుగారూ! నాలుకను మోసం చేస్తున్నానండి!" అన్నాడు. నేను మాట్లాడలేదు.

"శ్యామ్‌లాల్ స్థితి ఎలావుందండి?" అంతా అయాక మళ్లీ అడిగాడు.

"భయపడవలసినపనిలేదండి. తొందరగానే నయ మవుతుంది."

"ఐతే—జ్వరంలో ఎక్కువగా దానిమ్మపళ్ళు ఇవ్వొచ్చు నంటారా?"

"కావాలని అడిగితే ఇవ్వండి. ఫరవాలేదు."

వృద్ధుడు కొంచెంసేపు మెదలకండా వూరుకుని "కానీ డాక్టరుగారూ! ఈదఫాకు మీరు మీ ఫీజును కొంచెం తగ్గించా లండి. నేను బీదవాణ్ణని మీకు తెలుసు! మాబోటి బీదవాళ్ళని మీరు కనిపెడుతూవుండాలి" అన్నాడు.

"ఇలానే అందరిదగ్గరా మా ఫీజును తగ్గించుకుంటే—మే మింక తినేదేమిటి? అందరమూ బీదవాళ్ళమే."

"పూర్తిగా తగ్గించొద్దులెండి. సగం ధర్మంగా వొదిలి పెట్టండి డాక్టరుగారూ! నేను చాలా బీదవాణ్ణి."

ఆఖరికి ఏదో ఒకవిధంగా నా ఫీజులో కొంత తగ్గించి పైకం తెచ్చుకున్నాను!

# 11

ఇంకొక పదిహేను రోజులు గడిచినయ్. పనీ పాటా ఏమీలేదు. మంచంమీద పడుకుని నిద్రపోతున్నాను.

ఆ నిద్రలో కలవచ్చింది. 'ఆమె' వచ్చినట్లయింది. తోటలో, వెండిలాంటి వెన్నెల్లో యెవరూలేని స్థలంలో ఇద్దరం కూర్చున్నాం.

"నువు కవిత్వంతో రాసిన ఉత్తరం నాకు చేరి చాలా రోజులైంది. అప్పట్నుంచి ఇప్పటివరకూ మళ్ళీ నాకు చిన్న కాగితంముక్కకూడా రాయనేలేదు. ఐతే - నన్ను మరిచిపోయా రన్నమాట?" అని 'ఆమె' నన్ను అడిగింది.

"లేదు. మరిచిపోలేదు. నిన్ను మరిచిపోవడమనేది ఈ జీవితంలో కలుగుతుందా? అమ్మో!"

"ఐతే—నీ జీవితంలో భాగం పంచుకునేందుకు ఇంకెవ రన్నా దొరికారా?"

"అవును. ఒక నర్సు దొరికింది."

"ఏమిటీ!—"

"ఏమీ లేదు. నిన్ను చూసాక మళ్ళీ అందర్నీ మరిచి పోయాను."

"ఐతే నామీద ఇప్పుడు కవిత్వం రాయడం లే దెందు కని ?"

"ఇప్పుడు రాసి - చదవమంటావా ?"

"రాసి - చదువు; చక్కగా పాడు."

కవితాసృష్టితోపాటు కలలో చదవడం, పాడడం జరుగుతూవుంది. "ఆమె" నా భుజంమీద తల ఆనించి కవిత్వంలోని రసాస్వాదనం చేస్తూందని నాకు బాగా గుర్తు.

"....అర్ధరాత్రి గుర్తుందా ?
ప్రపంచమంతా నిశ్శబ్దంలో
మునిగిన ఆ రాత్రి నీకు —— అర్ధరాత్రి గుర్తుందా?
ఏ సద్దూ లేదు చూడ
దీపాలు లేవు కూడ
నిబిడాంధకారజగతి
తారాసందోహ కాంతి
వెలుగులో నే కిటికి తెరవ
పూర్ణిమకాంతి నీ ముఖము మెరవ
నా మనసంతా నీ కోసమే
నా కళ్ళన్నీ నీ కోసమె

పరువెత్తీ, పరువెత్తీ
కలుసుకున్న మధురక్షణం
మరిచితివా ప్రియసఖియా!
బూటకమా ఇది సఖియా!
నీ హృదయంలో నేను లేనా?
నాకోసం నువు రావా?
ఆ రాత్రిని మరిచితివా?
అర్ధరాత్రి గుర్తుందా....?"
"—డాక్టరుగారూ?"

ఆకంఠధ్వనికి నానిద్ర ఎగిరిపోయింది. కల తెగిపోయింది.

"కంగ్....కంగ్....ఖంగ్ మని ఎవరో బైట దగ్గుతున్న సవ్వడి వినిపించింది.

లేచి తలుపు తీశాను. 'ఆస్మానీ' నిలుచునివుంది. చేతిలో ఏదో పొట్లముంది....

"ఏం, ఆస్మానీ. ఎలావుంది?"

"తమరు నన్ను చూడడానికే రాలేదు. నాడిని చూపించుకుందామని నేనే వచ్చాను."

"ఇప్పుడు ఎలావుందో చెప్పు – సరే, లోపలకు రా."

"నాకేమీ బావుండడంలేదు బాబుగారు! ఈమారు నా జబ్బు ఏమీ తగ్గలేదేమండి?"

"తగ్గుతుందిలే. తొందరపడితే ఎలా? ఇంకా కొన్ని రోజులు తినాలి."

"ఏమాత్రం తగ్గలేదండి. ఇంకా ఎక్కువవుతున్నట్లుగా వుంది. రాత్రి తెల్లార్లూ నిద్రలేదు. దగ్గుతూనే వున్నాను" అని

గట్టిగా దగ్గడం మొదలుపెట్టింది. దగ్గుతాలూకు ఉద్ధృతం తగ్గాక "ఇంకొకవిధంగా అనుకోనట్లయితే మీకొక సంగతి చెబుతానండి డాక్టరుగారూ!" అన్నది.

"ఏమిటో చెప్పు—?"

"ఈ జీవితంలో మిగిల్చి దాచుకున్న ఈ కొద్దిపాటి నగల్ని తీసుకునివచ్చాను. నా జీవిత సర్వస్వమూ అవే!— తమరు దయుంచి పుచ్చుకుని——"

"నీ నగల్నా—? నా కెందుకు?"

"ఎంతకాలమని మీదగ్గర నేను వూరికినే మందు తింటూ, చికిత్సచేయించుకుంటాను? . అప్పుడు ఒక్క "సీసామందు తింటేనే నయమైంది. ఈనాడు ఎన్నిమందులు తిన్నా రోగం ఏ మాత్రం తిరుగుముఖంపట్టలేదు. మీకు సాష్టాంగ ప్రణామం చేస్తాను బాబూ! - బాగా పరీక్షచేసి మందివ్వండి."

అస్మానీ మాటలు నా హృదయాన్ని పిండిచేసినయ్. ఆమె మనసులోని ఆవేదనన్నీ అనుమానానీ గ్రహించాను. డబ్బు తీసుకోకండా చికిత్స చేస్తూ, ఏదో ఒక మందు రాసిస్తున్నా ననీ, నిర్లక్ష్యంగా చూస్తున్నాననీ, ఆమె తన మనసులో ఒక విధ మైన సంశయాన్ని పెట్టుకుని బాధపడుతూవుంది. శరీరంలోని రోగంకంటే - ఈ అనుమానమే ఆమెను ఎక్కువగా క్రుంగ దీస్తూంది. చాలాసేపు ఆలోచించి "నీకు మంచిమందే ఇస్తు న్నాను అస్మానీ ఆనాడుమాత్రం నాకు నువ్వేం ఇచ్చావు? అప్పుడు నీకేమన్నా నేను చెడ్డమందు ఇచ్చానా?" అని అడిగాను.

"అదికాదు బాబూ, నేననేది అదికాదు. మా పొరుగింటి

'రంగసాని' డబ్బుతీసుకోకండా ఇచ్చేమందు పనిచేయదని అంటూవుంది; అందుకని........"

"నీకలా అనుమానం వుంటే ముందు నయంకానీయ్. ఆ తర్వాత అంతా ఇద్దువుగాని. నీకివ్వాలని వుంటే అప్పుడైనా ఇవ్వొచ్చుగా!"

"అలా అయితే బాగా పరీక్షించి, తొందరగా నయమయే మందివ్వండి. ఎంతకాలమని ఈ బాధపడను బాబూ?"

దాని కళ్ళల్లో నీళ్ళు తిరగడం కనిపించింది. ఈనాడు దానికి ఆరోజుల్లోని తళతళ లేదు. అందంలేదు. ఆ కళలేదు. నున్నని పలచని బుగ్గలు మాయమై, ఎముకలు బైటపడినయ్. రక్తంలేని ముఖం! జీవితంలోని దీపం ఆరిపోతున్నట్లుగా వెలిగే కాంతి, కళ్ళు లోపలికి పీక్కుపోయినయ్. ఎదురుగా కూచుని దగ్గుతూవుంది.

"సరే—ఈసారి ఖరీదుగలమందు రాసిస్తాను. వేళ ప్రకారం ఆ మందు తిను. తొందరగా నయమవుతుంది." అన్నాను.

అస్మాని కళ్ళనీళ్ళతో నావేపు చూస్తూ మాట్లాడకండా వుండిపోయింది. ఎన్నోవిధాల నచ్చచెప్పి ఆమెను ఇంటికిపంపించాను.

# 12

అక్కడ ఎంతసేపు కూర్చున్నానో నేనే చెప్పలేను. కాలంగడిచిపోతున్నకొద్దీ, నా అసమర్థత నాకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఎంతకాలమని ఛద్మవేషంతో నా వాస్తవిక రూపాన్ని దాయగలుగుతాను?—

జ్ఞానానికి అహంకారమనేది వుంది. ఆ మిడిమిడి జ్ఞానాన్నాధారంగా చేసుకొని చాలామంది చదువుకున్నవాళ్లు, రెపరెపలాడుతున్న దీపం తీసుకొని—ప్రపంచంలో అలుముకున్న అంధకారాన్ని తరిమేందుకు ప్రయత్నించడం ఈ కళ్లతో చూస్తూనే వున్నాను. ఇంకొంతమంది వర్తి దీపాన్ని పుచ్చుకునే తిరుగుతున్నారు. వాళ్లదగ్గర రెపరెపలాడేందుకు దోహదమైన 'వొత్తి' కూడా వుండదు.

ఇక వివేకమో—? వివేకమనేది పుస్తకాల్లోని న్యాయశాస్త్రంలాంటిది! సమాజపు శృంఖలాల్ని తెగిపోకండా వుంచేందుకే ఈనాడు వివేకం బాగా ఉపయోగపడుతుంది దయా, మాయ, మమత, స్నేహం, కరుణా మొదలైనవన్నీ ఒక్క దెబ్బతో వివేకం ముందు ఎగిరిపోతయ్! కాలంతోపాటు, వీలునుబట్టి వివేకం కూడా తన రూపాన్ని మారుస్తూవుంటుంది.

నేను బైటికి వెల్తూన్నప్పుడు వేసుకుంటూండే సూటుకు వివేకానికి తేడా అనేది ఏమీ కనిపించనేలేదు. ఆ సూటును నేను బైటికి వెల్తూన్నప్పుడుమాత్రమే వేసుకుంటాను. నా జీవిత తత్వానికీ దానికీ—ఆకాశానికీ భూమికీ వున్నంత తేడా వుంది!

బైట ఏదో గలభా జరుగుతూవుంది. ఎవరో ఎవరినో కొడుతూన్నట్లుగా వుంది.

రెప్పపాటుకాలంలో హరీశ్‌బాబు లోపలికి ఏడుస్తూ వచ్చాడు. తల పగిలిపోయి రక్తం కారుతూవుంది. రక్తంతో చొక్కా తడిసిపోయింది.

"ఏమిటి?—ఏమిటిదంతా?"

భజువ అతణ్ని కర్రతో కొట్టాడని తెలిసింది.

భజువ——? నా నౌకరు భజువ—!

"ఎందుకొట్టాడు? ఎందుకని కొట్టాడు? అసలు విషయం ఏమిటి?"

హరీశ్‌బాబు వాడి పెళ్ళాన్ని........

బైటినించి భజువ "ఈవెధవను చంపేస్తాను. వొదిలి పెట్టండి" అని అరుస్తున్నాడు.

ఎంతో కష్టంమీద వాణ్ని బ్రతిమలాడి పంపించాను.

నా చేతులతో కట్టిన కట్టుతో హరీశ్‌బాబు ఆ మరునాడు వూరంతా తిరిగి "ఈ డాక్టరే భజువాకు చెప్పి—కొట్టించాడు. లేక పోతే ఆ అణాకాని వెధవకు నన్ను కొట్టడానికి గుండెలు ఎక్కణ్నుంచి వస్తయ్? ఈ డాక్టరుపని పట్టితీరుతాను." అన్నట్లు విన్నాను.

ఏంలాభం? అన్ని సంగతులూ వినికూడా మెదలకండా వూరుకున్నాను. నేను మాత్రం భజువానుకాను. వాడుచేసినట్లు చేయలేను. లేనట్లయితే నేనుకూడా మానవుల్లానే వుండేవాణ్ని!—— మనసులోనే హరీశ్‌బాబును క్షమించి, ప్రతిరోజూ తలకు కట్టు కడుతూనేవున్నాను.

* * *

ఆనాడు హరీశ్‌బాబు నౌకరు 'రాందన్' ఒక గిన్నెనిండా ఆకుకూరలు తీసుకొనివచ్చి "అమ్మగారు స్వయంగా వండి పంపించారండి" అని చెప్పాడు!

మాట్లాడకండా ఆ కూర తీసుకున్నాను.

ఆమె హృదయంలో నామీద ఎంత అపార ప్రేమ వుంది

ఇవాళ ఆ పిసినిగొట్టు మల్లిక్ దగ్గర్నుంచి నాకు ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి స్థభించిపోయాను. ప్రస్తుతం మహేంద్రుడు జైల్లో వున్నాడుట। తన మూడో భార్య శ్యామ్ లాల్‌తో ఎక్కడికో ఎగిరిపోయిందట। చివరకు "ప్రపంచంలో నాకింకేమీ సుఖమనేది లేదు. మనసంతా వైరాగ్యంతో నిండిపోయింది. నాదగ్గర లక్షన్నర రొఖ్ఖం వున్నది. ఒక జమీందారీ గ్రామానికి నేను అధికారిని. వీటిని ఏదైనా సత్కార్యంకోసం దానం చేయాలనుకుంటున్నాను. నాభార్య ఎక్కడ ఎవరితోవున్నా- ఆమె జీవితాంతం, ఆమె ఖర్చులకీ, పోషణకి సరిపోయినంత డబ్బు పంపాలి. నా వీలునామా ఉద్దేశ్యం ఇదే। నేనామెను చాలా 'ఇది'గా ప్రేమించాను. ఆమె నిజంగా తప్పే చేసింది. ఈ అపరాధకారణంతో ఆమె కడుపు మాడ్చుకుని బతకడం నాకేమాత్రం ఇష్టంలేదు. నేనుకూడా ఆమెకు చాలా అన్యాయం చేసాను. లేవలేని ముసలితనంలో, యవ్వనంలో వున్న పిల్లను డబ్బుబలంతో వివాహం చేసుకున్నాను. ఈ పాపానికి తగిన ప్రాయశ్చిత్తం చేసుకోవాలనే సంకల్పంతో నామిగిలిన సంపదంతా— మహిళాభ్యుదయానికి ఖర్చుపెట్టాలని అనుకుంటున్నాను. ఇదే నా కోరిక। ఇదే నా అభిప్రాయం। నా ఆశయానికి పునాదిగా మిమ్మల్ని ట్రస్టీగా ఇందుకు నియమించాలని వుంది. నా కోరిక మన్నించి మీ అభిప్రాయం వెంటనే తెలియపరచండి...." అని రాసారు.

మానవ హృదయాలు, ఎప్పుడన్నా ఎవరికన్నా అర్థమవుతాయా?

ఇంతెందుకూ?-'ఆమె' హృదయాన్ని మాత్రం నేను సరిగా అర్థంచేసుకోగలిగానా? ఐతే-'ఆమె' నేననుకున్నట్లుగానే వుంటుందా? ఆమె నా ప్రేమని తృణీకరించి ఎవరినో ప్రేమించేందుకు తయారైంది. ఏనాడన్నా నాకు రెండుపంక్తుల ఉత్తరం రాసినపాపానపోయిందా?

ఐనా–మానవహృదయం ఎంత విచిత్రమయింది!

నేను వాస్తవమైన విషయాన్ని త్రోసివేసి, పగటి కలలు ంటున్నాను.

# 13

రోజులు అలానే గడిచిపోతున్నయ్.

రోగుల్లో కొంతమందికి నయమవుతూవుంది. కొంతమంది చనిపోతూవున్నారు. నేనుమాత్రం డబ్బు పుచ్చుకుంటూ, ప్రాక్టీసు చేసుకుంటూనే వున్నాను. కాని, రోజురోజుకి ప్రాక్టీసుమీద విరక్తి అసహ్యం కలుగుతూవుంది.

పని తక్కువగావున్న రోజుల్లోకూడా మనసుకు శాంతనేదిలేకుండాపోయింది. నామనసుకేది కావాలో దాన్నే నేను తెలుసుకోలేకండాపోయాను. అందుకనేకామోలు మానవులంతా వృద్ధాప్యంలో భగవద్భజన చేస్తూండడం! అంటే-వాళ్ళెప్పుడూ పొందలేని వస్తువుకోసం భజనచేస్తూ ఆ వస్తువును ప్రసాదించమని ప్రార్థించడమన్నమాట! పసిపిల్లలు చందమామని కావాలన్నట్లే-ఈ వంకతో వృద్ధాప్యంలో మానవుడు భగవంతుని పొందేం

ఆకసమంతా చీకటై- ఈ
లోకమంతా చీకటై
వీచిన పెనుగాలుల్లో
రేగిన తుఫానుల్లో
ఆశాజ్యోతి నాధారంగా—
గాసిజెందె హృదయంతో
బాధపడే మమతలతో!
వెధ్దకి వెదకి వేసారి,
విసువెత్తెను బాటసారి
రేగిన తుఫాన్కుగ్గాలి
ఆర్పు నెపుడో ఈ జ్యోతిన్నీ
గడ్డిపోచలాంటి మనసు
ఎగురునుకద పెనుగాలికి.

[ ఐపోయింది ]